



ప్రారంభానికి సిద్ధమైన వాటర్‌ఫాల్స్

అక్షరం అండగా అభివృద్ధి మెండుగా..

- ఒంగోలు ఎన్టీఆర్ పార్కులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- హాజరుకానున్న ఎమ్మెల్యే దామచర్ల, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ ఆదిత్య, అధికారులు
- 37వ డివిజన్‌లో పలు సమస్యల పరిష్కారం
- రూ.2కోట్ల విలువైన పనులు మంజూరు
- రూ.70లక్షల విలువైనవి పూర్తి



ఆకర్షణీయంగా వ్యాయామశాల

అక్షరం ఆయుధమైంది. ప్రజలకు అండగా నిలిచింది. విరామమెరుగని శ్రమ చేసింది. ప్రజా సమస్యలపై వరుస కథనాలతో అటు జనానికీ, ఇటు ప్రభుత్వానికీ వారధిలా నిలిచింది. జనఘోష... ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికెళ్లేలా చేసింది. వారు సానుకూలంగా స్పందించి అభివృద్ధికి బాటలు వేయడం, నిధులు వెచ్చించి పనులు చేయించడం, నిరంతరం పర్యవేక్షించడం లాంటి చర్యలతో ఒంగోలులోని 37వ డివిజన్‌లో ఎన్టీఆర్ పార్కు ఇప్పుడు సుందరంగా రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటలకు ఆ పార్కులో 'అక్షరం అండగా పరిష్కారం అజెండాగా' సభ జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి డైరెక్టర్ ఆదిత్య, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు.

ఒంగోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : నగరం వేగంగా విస్తరిస్తోంది. దశాబ్దకాలంలో అనేక కొత్త కాలనీలు

మిగతా 6లో...



ఒంగోలులో సుందరంగా రూపుదిద్దిన 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్క్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన జేసీ గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

- పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశం
- ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్‌పై సమీక్ష
- గ్రామాల్లో కూడా త్వరలో అన్న క్యాంటీన్లు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఒడా, నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (ఒడా)పై సమీక్షించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు కనీస సౌకర్యాలైన తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ఆదేశించారు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ చేపట్టామని తెలిపారు. అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మిగిలిపోయిన 85లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ రెండో తేదీ నాటికి రీసైకిల్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే 40లక్షల టన్నుల చెత్తను ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లలో

మిగతా 6లో...

సురేష్ ఇంట్లోనే వ్యూహం

- వీరయ్య హత్యపై పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి..
- విచారణ సమయంలో తప్పించుకునేందుకు యత్నించిన ఇద్దరు నిందితులు
- నలుగురికి ముగిసిన పోలీసు కస్టడీ

ఒంగోలు క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వీరయ్యాచౌదరి హత్యకు ముప్పా సురేష్ ఇంట్లో పథకం రూపొందించినట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైంది. ఈనెల 24 నుంచి 27 వరకు జైలులో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు తమ కస్టడీకి తీసుకొని విచారించారు. దీంతో వీరయ్యాచౌదరి హత్యకు పథకంలో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న ముప్పా సురేష్ ఇంట్లో నిందితులు సాంబశివరావు, వినోద్‌లు సురేష్‌తో సమావేశమయ్యారు. ఆ సమయంలో సురేష్ భార్య కూడా అక్కడ ఉన్నట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. వినోద్, సాంబశివరావుల మధ్య ఎలాంటి లావాదేవీలు జరిగాయనే కోణంలో కూడా పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఒంగోలులో ఉన్న వినోద్ ఇంట్లో, అమ్మనబ్రోలులో ఉన్న సాంబశివరావు ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. కేసు విచారణలో భాగంగా శుక్రవారం కీలక నిందితులు నాగరాజు, రుత్వేంద్రబాబులను పేర్నమిట్ట సమీపంలోని లింగారెడ్డి అపార్ట్‌మెంట్ ప్రాంతానికి పోలీసులు తీసుకెళ్లారు. వీరయ్య చౌదరిని హత్య చేసిన తరువాత నిందితులు నాగరాజు, గౌతమ్‌లు మోటర్ సైకిల్‌పై అటు వైపుగా పరారయ్యారు. ఆ క్రమంలో లింగారెడ్డి అపార్ట్‌మెంట్ సమీపంలో నాగరాజు దుస్తులున్న బ్యాగ్‌ను పడవేశాడు. అందుకోసం పోలీసులు ఆ ప్రాంతానికి నాగరాజు, రుత్వేంద్రబాబును తీసుకెళ్లారు. ఈ క్రమంలో దట్టంగా ఉన్న ముళ్ల పొదల

మిగతా 6లో...

సంరక్షణ మరచి స్వాహా

- సంరక్షకుడి ముసుగులో చదలవాడ సర్పంచ్ అకృత్యాలు
- అడ్డుకున్న దేవస్థానం ఈవో, టీడీపీ నేత, గ్రామస్థులు
- ప్రస్తుతం గోమాతలకు ఆంజనేయుడే దిక్కు..

7

విచారణలో వెనుకంజ

- బోగస్ గ్రూపులపై కదలని అధికారులు
- మెప్మాలో రుణ మోసాలపై విమర్శలు

పట్టణ పేద మహిళలకు ఆర్థిక స్వావలంబన అందించడం కోసం ఏర్పాటు చేసిన మెప్మా అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రూ.కోట్లు దండుకోగా, అదే వ్యవహారం నేటికీ కొనసాగుతోంది. కొందరు ఆర్పీలు మహిళల పేరుతో బోగస్ గ్రూపులు సృష్టించి బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. ఈ ఏడాదిలో జనవరి నుంచి అదే తంతు మొదలైంది. ఇప్పటివరకు 78 బోగస్ గ్రూపులను అధికారులు గుర్తించారు. వీటి విచారణ ఇప్పటికీ వెనుకంజలోనే ఉండటం గమనార్హం.



ఒంగోలు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బోగస్ గ్రూపుల భాగోతంపై మొదట్లో కాస్తంత దృష్టిసారించిన మెప్మా అధికారులు ఆ తర్వాత వెనుకంజ వేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొందరు ఆర్పీలపై గత వైసీపీ హయాంలో ఎలాంటి చర్యలు లేవు. మొక్కుబడి చర్యలు, మెమోలతో సరిపెట్టారు. ఇప్పుడు ఏమవుతుందన్న భావనలో నేటికీ అదే తంతును కొనసాగిస్తున్నారు. ఇదే విషయమై పీడీ శ్రీహరి మొదట్లో బోగస్ గ్రూపుల భాగోతంపై నలుగురితో విచారణ కమిటీగా నియమించగా, నేటికీ ఎలాంటి పురోగతీ కనిపించడం లేదని తెలుస్తోంది. బోగస్ గ్రూపుల గురించి పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ వ్యవహారానికి పాల్పడుతున్న ఆర్పీలు మరింత రెచ్చిపోతున్నారు.

అధికారుల తీరుపైనా అనుమానం

బ్యాంకు రుణాల బాగోతంలో పాత్రధారులుగా ఉన్నవారు తమకేమీ కాదన్నట్లుగా బహిరంగంగా చెప్పుకోవడం అనుమానాలకు

మిగతా 6లో...

వచ్చే సీజన్ ఉత్పత్తి లక్ష్యంలో కోత

- ప్రస్తుత సీజన్ కన్నా 15 మిలియన్లు తగ్గిస్తూ పొగాకు బోర్డు నిర్ణయం

ఒంగోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో వచ్చే సీజన్ పొగాకు పంట ఉత్పత్తి లక్ష్యంలో పొగాకు బోర్డు కోత విధించింది. ప్రస్తుత సీజన్ (2024-25)లో ఇచ్చిన పరిమాణంలో ఏకంగా 15 మిలియన్ కిలోలను తగ్గించి వేశారు. ఆ మేరకు గురువారం గుంటూరులో జరిగిన పొగాకు బోర్డు పాలకమండలి సమావేశంలో వచ్చే సీజన్ పంట ఉత్పత్తి అనుమతిపై తీర్మానించారు. రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ (2024-25)లో 167 మిలియన్ కిలోలు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 240 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరిగినట్లు అంచనా. అందులో దక్షిణాదిలోని రెండు రీజియన్లలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న 11 వేలం కేంద్రాలలో 105 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా దాదాపు 162 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగినట్లు అంచనా వేశారు. దక్షిణాదిలో ప్రస్తుత సీజన్ కొనుగోళ్లు ప్రారంభించి మూడున్నర నెలలు అవుతున్నా పండిన పంటలో మూడవ వంతు కూడా అమ్మకాలు పూర్తికాలేదు. అంతేకాక మార్కెట్ తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. ఉత్తరాదిలోను అలాగే ఉంది. దీంతో



వచ్చే సీజన్‌లో పంట ఉత్పత్తిని నియంత్రించాలని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి పొగాకు బోర్డుపై తీవ్ర ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. తదనుగుణంగా గురువారం జరిగిన బోర్డు సమావేశంలో ప్రస్తుత సీజన్ కన్నా 25 మిలియన్ కిలోలు తగ్గించి 42 మిలియన్లు పంట ఉత్పత్తికి అనుమతిస్తూ నిర్ణయించారు. అలా తగ్గించిన 25 మిలియన్లలో 15 మిలియన్ కిలోలు దక్షిణాదిలోను, 10 మిలియన్లు ఉత్తరాదిలోను తగ్గించారు. ఆ ప్రకారం ఒక్కో బ్యారన్‌కు ఇచ్చే పంట ఉత్పత్తి సగటున దక్షిణాదిలోనే ఆరు క్వింటాళ్ల వరకు తగ్గనుంది. దక్షిణాదిలోని రెండు రీజియన్‌లలో

మిగతా 6లో...

రుచిగా.. శుచిగా..



- ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో విద్యార్థులకు ఆహారం
- మధ్యాహ్న భోజనం ఇష్టంగా తింటున్న విద్యార్థులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

7

సచివాలయ కార్యదర్శుల బదిలీలు

- నేడు, రేపు పాత జడ్పీలో కౌన్సెలింగ్
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



ఒంగోలు కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ అధికారి కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులు బదిలీల కౌన్సెలింగ్ శని, ఆదివారాలు నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆధ్వర్యంలో ఈ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ నెలాఖరులోపు బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు శనివారం ఉదయం 10 గంటల నుంచి ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. శనివారం హాజరు కాని గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు. గ్రేడ్-5 కార్యదర్శులకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఐదేళ్లు ఒకచోట పనిచేసిన కార్యదర్శులను వారి సొంత మండలాల్లో కాకుండా ఇతర మండలాల్లో నియమించాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు బకాయిల గుదిబండ భారంగా మారింది. వైసీపీ పాలనలో రూపాయి రుణం కూడా ఎస్సీలకు అందలేదు. ఆ పార్టీ అధికారంలోకిరాగానే అప్పటివరకు అమల్లో ఉన్న దాదాపు అన్ని పథకాలను అటకెక్కించింది. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు రుణంగా ఇచ్చి ఎస్సీలకు కార్పొరేషన్ ద్వారా విలువైన యూనిట్లను అందజేశారు. ఆ రుణాలను పొందిన లబ్ధిదారుల్లో 90 శాతం మంది తీసుకున్న తిరిగి సక్రమంగా చెల్లించ లేదు. దీంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వాటిని రికవరీ చేసే పని వేగంగా జరుగుతోంది.

ఎస్సీ కార్పొరేషన్‌లో బండెడు బకాయిలు

- రికవరీపై దృష్టిపెట్టిన ప్రభుత్వం
- లబ్ధిదారులకు నోటీసులు



ఒంగోలు నగరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు 2016 - 2019 సంవత్సరాల మధ్యలో విలువైన యూనిట్లను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చే నిధులతో ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఇన్నోవా రవాణా వాహనాలు, ఇతియోస్ రవాణా వాహనాలను లబ్ధిదారులకు ఇచ్చారు. టెంట్ హౌస్‌లు, మినీ డెయిరీలు, హోల్‌సేల్ మందుల దుకాణాలు, కిరాణా దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు వంటి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను అందజేశారు. అయితే వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ గురించి పట్టించుకున్న దిక్కే లేకుండా పోయింది. రుణాల రికవరీని కూడా చేపట్టలేదు. దీంతో కార్పొరేషన్‌లో బకాయిలు గుదిబండలా పేరుకుపోయాయి. ఇప్పుడు ప్రభుత్వం రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రుణాలు పొందిన వారి నుంచి తిరిగి రాబట్టాలని కార్పొరేషన్ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులపై ఒత్తిడి పెరిగింది.



రుణాల వివరాలివీ..

ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద ఇచ్చిన రుణాల్లో ఇంకా రూ.10.54 కోట్లు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద ఇచ్చిన రుణాల్లో రూ.6.34 కోట్లు, ఇన్నోవా వాహనాలు పొందిన వారు రూ.7.16కోట్లు, ఇతియోస్ కార్లు పొందిన వారు రూ.2.33 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరు రుణాలను తిరిగి చెల్లించాల్సిన గడువు కూడా ముగిసిపోయింది. దీంతో వీరి నుంచి రుణాలను రాబట్టేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. రుణ గ్రహీతల నుంచి రికవరీ చేసేందుకు నోటీసులు ఇప్పటికే జారీ చేశారు. వీరి నుంచి పెద్దగా స్పందన రాకపోవటంతో నేరుగా లబ్ధిదారులను కలిసి రుణాలను రాబట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారులే నేరుగా లబ్ధిదారుల వద్దకు పోయి వారి నుంచి రుణాలను తిరిగి కట్టించుకోనున్నారు.

కార్పొరేషన్ ద్వారా పథకాలు ఇప్పట్లో లేనట్లే

వైసీపీ పాలనలో ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా మూతపడిపోయింది. అంతకుముందు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ హయాంలో కార్పొరేషన్ పథకాల అమలుతో మళ్లీ కళకళలాడింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మళ్లీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం రాబోతుందని ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా కార్పొరేషన్‌లో పథకాల జాడే కనిపించటం లేదు. దీంతో ఈ కార్పొరేషన్ ద్వారా పథకాలు ఇప్పట్లో లేనట్టేనని చర్చ నడుస్తోంది.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

రూ.17 వేల జరిమానా



నిందితులతో సంతమాగులూరు పోలీస్ సిబ్బంది

అద్దంకి, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ఆరుగురికి ఏడేళ్ల జైలుశిక్ష రూ.17 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి శుక్రవారం తీర్పుచెప్పారు. సంతమాగులూరు ఎస్సై మేదరమెట్ల పట్టాభిరామయ్య కథనం మేరకు.., సంతమాగులూరు మండలం కుందుర్తికి చెందిన బొమ్మినేని కృష్ణయ్య, నిందితులకు పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపధ్యంలో 2020 నవంబరు 11వ తేదీ సాయంత్రం బెండకాయలను కొమ్మాలపాడులో కాటా వేసి బాబాయి వీరాస్వామితో కలిసి బొమ్మినేని కృష్ణయ్య తిరిగి వస్తున్నారు. ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలో అదే గ్రామానికి చెందిన జడ వెంకటేశ్వర్లు, జడ వీరాంజనేయులు, జడ వెంకట్రావు, జడ శ్రీనివాసరావు, జడ గోపి లతో పాటు వినుకొండ మండలం నాగులవరానికి చెందిన కొణికి యోగయ్యలు దారి కాచి కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో కృష్ణయ్య, వీరాస్వామిల తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. అప్పట్లో ఎస్సైగా ఉన్న శివన్నారాయణ కేసు నమోదు చేశారు. అద్దంకి కోర్టులో కేసు విచారణకు రావడంతో సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్సై పట్టాభిరామయ్యల పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుళ్లు వెంకటేష్, కృష్ణలు సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చేప్పే విధంగా తర్ఫీదు నిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.వీరనారాయణ కోర్టు లో వాదనలు వినిపించారు. కేసు విచారించిన న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి శుక్రవారం ఆరుగురు దోషులకు 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.17 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అప్పుడే బాధితులకు న్యాయం : ఎస్పీ

నేరం చేసిన వ్యక్తులకు కోర్టులో శిక్ష పడినప్పుడే బాధితుడికి న్యాయం చేసినట్లు అవుతుందని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. నేరస్తులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను ఎస్పీ తుషార్‌డూడి ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల దాడులు

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం(చీరాల), మే 27 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. కొంత కాలంగా మండలానికి చెందిన కొందరు వ్యక్తులు రాత్రింబవళ్లు ఇసుక రవాణా సాగిస్తున్నారు. అయితే రవాణాలో ఎవ్వరికి చెందాల్సిన ముడుపులు వారికి చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఏక కాలంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అధికారులు ఐదు ట్రాక్టర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే కొందరిపై కేసులు కూడా నమోదైనట్లు సమాచారం. అయితే దాడులు పారదర్శకంగా ఉంటాయా..? లేక తాత్కాలికమేనా...? అని వేచి చూడాల్సి ఉంది. అలాగే ఇప్పటి వరకు జరిగిన అక్రమ రవాణాపై అధికారులు అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

స్కూళ్ల పనివేళల్లో సమావేశాలు వద్దు

● పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

ఒంగోలు(విద్య), జూన్27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎటువంటి సమావేశాలు నిర్వహించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాల ప్రారంభ సమయం ఉదయం 9నుంచి ముగింపు సమయం సాయంత్రం 4గంటల వరకు సమావేశాలు జరపకూడదని, ఈ మేరకు ఆర్జేడీలు, డీఈవోలు, ఉప విద్యాధికారులు, ఎంఈవోలను ఆదేశిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. స్కూళ్లలో తరగతులు నిర్వహించే సమయంలో సమావేశాలు నిర్వహిస్తే బోధనకు ఆటంకం కలుగుతుందని, విద్యార్థుల విద్యాభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. స్కూళ్ల పని వేళల అనంతరం మాత్రమే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డైరెక్టర్ హెచ్చరించారు.

దేవాలయాలకు వెళ్లాలంటే భయం భయం


శిథిలావస్థకు చేరుతున్న కొణిదెన ప్రసిద్ధ గుళ్లు
ముక్తేశ్వరంలో పురాతన కాలంనాటివి జీర్ణావస్థకు
పడిపోతున్న గోడలు
ప్రతిపాదనల తయారీలో జాప్యం చేస్తున్న అధికారులు
చోళరాజుల కాలం నాటి దేవాలయాలు
కనుమరుగయ్యే ప్రమాదం
పట్టించుకోని దేవదాయ, పురావస్తుశాఖలు
మాన్యాలున్నా అభివృద్ధి లేదని భక్తుల ఆందోళన



శిథిలావస్థకు చేరిన కొణిదెన వేణుగోపాల స్వామి దేవాలయం

బల్లికురవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రసిద్ధ పురాతన దేవాలయాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతున్నాయి. సామాన్యశకం 11వ శతాబ్దపు నాటి పురాతన దేవాలయాలకు నేడు ఆలనా పాలనా కరువైంది. కొంతకాలానికి ఆనవాళ్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని భక్తులు వాపోతున్నారు. ఎంతో విలువైన భూములు ఉన్న దేవాలయాల గురించి మాత్రం దేవాదాయశాఖ, పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం అంటే గుర్తుకు వచ్చేది చోళరాజులు పరిపాలించిన కొణిదెన గ్రామం ఇక్కడ అప్పట్లో రాజులు 101 బావి కోటిఒక్క శాసనాలను ప్రతిష్ఠించారు. అప్పట్లోనే గ్రామంలో రాజులు వేణుగోపాల స్వామి, చెన్నకేశవస్వామి దేవాలయాలను నిర్మించారు. వందల సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన రెండు దేవాలయాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. అలానే ఈ గ్రామంలో ఎన్నో శాసనాలు కూడా ఉన్నాయి. పలుమార్లు పురావస్తుశాఖ అధికారులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించి ప్రసిద్ధ దేవాలయాలను అభివృద్ధి చేస్తామని గ్రామస్థులకు చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు ఈ దేవాలయాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దీంతో దేవాలయాల గోడలు పడిపోతున్నాయి. దేవాలయంలో ప్రశాంతంగా కూర్చుని పూజలు చేయాల్సిన భక్తులు భయాందోళన చెందుతున్నారు. దేవదాయశాఖ, పురావస్తుశాఖ అధికారులు ఒకరిపై ఒకరు అభివృద్ధి పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం పడిపోయిన చెన్నకేశవస్వామి దేవాలయ గోడ నిర్మాణానికి ఇంతవరకు ప్రతిపాదనలు కూడా పంపలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామ ప్రజలు ఇదేగ్రామంలో చోళరాజుల కాలంనాటి బ్రహ్మగుండాన్ని విరాళాలతో అభివృద్ధి చేపట్టారు. దేవాలయాలను నిర్మాణం చేయాలంటే నిధులు పెద్దఎత్తున కావాలని ప్రభుత్వం వెంటనే స్పందించి పురాతన దేవాలయాలను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో వందల సంవత్స రాల నుంచి కొండపై భాగంలో ఉన్న ముక్తిలింగేశ్వర స్వామి దేవాలయం జీర్ణావస్థకు చేరింది. ఈ దేవాలయానికి వెళ్లే మెట్లమార్గం కూడా చెట్లతో అల్లుకొని ఉందని ఈ దేవాలయం అభివృద్ధి పరచాలని భక్తులు కోరుతున్నారు. దేవాలయాలకు గతంలో వందల ఎకరాల భూములు ఉన్నాయని ఇప్పుడు ఆ భూములు కొన్ని ఆక్రమణలో ఉన్నాయని తక్షణమే ప్రభుత్వం రికార్డులలో ఉన్న ప్రకారం ఆ భూములను వెలికితీసి దేవాలయాలను అభివృద్ధి పరచాలని భక్తులు కోరుతున్నారు.



రెండేళ్ల క్రితం పడిపోయిన చెన్నకేశవస్వామి దేవాలయం గోడలు

కమాండ్ కంట్రోల్ ద్వారా మద్యం లావాదేవీల పర్యవేక్షణ

● ఈఎస్ ఆయేషాబేగం

ఒంగోలు క్రైం, జూన్27(ఆంధ్రజ్యోతి): మద్యం లావాదేవీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ పర్యవేక్షణ చేస్తున్నారని ఈఎస్ ఆయేషా బేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందుకోసం మద్యం దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 188 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పటికి 122 దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో మిగిలిన అన్ని దుకాణాల వద్ద ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ సీసీ కెమెరాలను అన్ని హెడ్‌క్వార్టర్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేస్తున్నామని, దీంతో ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా పర్యవేక్షించే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మద్యం విక్రయాలలో సమయపాలన కోసం పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. కానిస్టేబుల్‌కు రూట్‌లు ఏర్పాటు చేసి ఒక్కో కానిస్టేబుల్ 2 నుంచి 5 మద్యం దుకాణాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వారు మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసివేయించి ఐ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా మద్యం దుకాణాల వద్ద విధివిధానాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే 14005 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఇక బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు, మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని, ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఈఎస్ హెచ్చరించారు.

'అక్షరం అండ'గా.. అభివృద్ధి మెండుగా..

(5వపేజీ తరువాయి)

ఏర్పాటయ్యాయి. ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయి. తదనుగుణంగా సమస్యలు కూడా అధికంగానే ఉంటున్నాయి. ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగునీటి పైపులైన్లు వంటివి అధికం. అంతకు మించి దాదాపు పది, పన్నెండు కాలనీలకు కేంద్రంగా వాకింగ్, వ్యాయామం, పిల్లలు ఆటలు ఆడుకునే పార్కులో అనేక సమస్యలున్నాయి. ఇందుకు నగరంలోని 37వ డివిజన్ చక్కటి తార్కాణం. నగరంలో ఇదే పెద్ద డివిజన్ కూడా. దీంతో ఆ ప్రాంత ప్రజల మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఆంధ్రజ్యోతి దృష్టి సారించింది. అక్కడి ప్రజలను పలుకరించి వారి సమస్యలపై ఈ ఏడాది జనవరిలో ప్రత్యేక కథనాలు ప్రచురించింది. ఆ సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టి పడింది. అదే సమయంలో పట్టణ ప్రాంతం ప్రజల సమస్యలు పరిష్కారానికి ఆంధ్రజ్యోతి రాష్ట్రవ్యాప్తంగా 'అక్షరం అండగా పరిష్కారం అజెండాగా' కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా జనవరి 28న 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కులో సభ జరిగింది. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఆ సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వర రావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జనం చెప్పిన సమస్యలివీ..

● జనవరి 28న 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కులో జరిగిన సభలో 50 మందికి పైగా ఆయా కాలనీలవాసులు తమ ప్రాంతంలోని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెచ్చారు. మరికొంతమంది వ్యక్తిగత సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చారు.

ప్రధానంగా సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, పైపులైను, మురుగు కాలువలలో పూడికతీత ఇతర శానిటేషన్ సమస్యలు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఆక్రమణలు ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ సమస్యలను ఏకరువు పెట్టారు.

● ఆయా సమస్యలపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సానుకూలంగా స్పందించారు. డివిజన్‌లో రూ.10 కోట్లతో అన్ని అభివృద్ధి పనులూ చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణం కొన్ని అందుబాటులో ఉన్న నిధులతో అత్యవసర పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

● సభ జరిగిన రెండవ రోజునే కమిషనర్ వెంకటేశ్వరరావు కార్పొరేషన్ అధికారులతో కలిసి పార్కుతో పాటు పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అలా గడిచిన అయిదారు నెలల్లో పది, పన్నెండు సార్లు అధికారులతో పర్యటించడమే కాక, పార్కులోని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులుతో, ఆ ప్రాంత ప్రజలతో చర్చించి పలు సమస్యలు పరిష్కారానికి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

● అధికారులు వేగంగా స్పందించి తీసుకొన్న చర్యలకు స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మేడికొండ మోహన్‌లతో పాటు వాకర్స్ ప్రతినిధులు అండగా నిలిచారు.

● ఎమ్మెల్యే దామచర్ల, అధికారుల చొరవ, స్థానికుల సహకారంతో పాటు నిరంతరం ఆంధ్రజ్యోతి బృందం సమన్వయంతో డివిజన్‌లో పనులు జరిగాయి. దాదాపు రూ.2 కోట్లు విలువైన 26 పనులను చేపట్టారు. అందులో సుమారు రూ.70 లక్షల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

జరిగిన పనులు ఇవీ..

● ఎన్టీఆర్ పార్కులో తీవ్ర సమస్యగా ఉన్న వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

● వాకింగ్ ట్రాక్ విస్తరణతో పాటు ఆధునికీకరణ చేశారు.

● పిల్లలకు కొత్త ఆట వస్తువులు ఏర్పాటుతో పాటు కొన్నింటికి మరమ్మతులు చేశారు. చెట్లను సుందరంగా చెయ్యడంతోపాటు పార్కు అంతటా సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. వీటన్నిటికీ సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చించారు.

● 37వ డివిజన్‌లో పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్లు మరో రు.20 లక్షల పనులు పూర్తికాగా ఇంకా రూ.1.30 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

● డివిజన్ అంతటా శానిటేషన్‌తో పాటు అక్కడక్కడా ఉన్న ఆక్రమణలు తొలగింపు, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. ఈ నేపథ్యంలో 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' సభ శనివారం జరుగనుంది. సాయంత్రం 4 గంటలకు 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కులో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మేడికొండ మోహన్ తదితరులు పాల్గొననున్నారు.

● తొలుత రూ.70లక్షలతో పూర్తిచేసిన పనుల ప్రారంభోత్సవాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. సభలో డివిజన్ ప్రజలు, వాకర్స్ సభ్యులు అధికంగా పాల్గొని జయప్రదం చెయ్యాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెన్నుపాటి ప్రసాద రావు, కుర్రా భాస్కర రావు తదితరులు కోరారు. సభ నేపథ్యంలో పార్కులో పనులను కమీషనర్ కె.వెంకటేశ్వర రావు, ఆంధ్రజ్యోతి మేనేజర్ ఐ.వి.సుబ్బారావు తదితరులు శనివారం పరిశీలించారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి బీఎం సుబ్బారావు

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

(5వపేజీ తరువాయి)

రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేస్తామన్నారు. బోర్లు నుంచి కాకుండా నదుల వంటి ఉపరితల వనరుల నుంచి నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్న మంత్రి నారాయణ ఈ దిశగా టెండర్లు పిలిచినట్లు తెలిపారు. మున్సిపాలిటీలలో తాగునీటితో పాటు పారిశుధ్యం, రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఒంగోలులో రోడ్ల విస్తరణలో నష్టపోయే వారికి టీడీఆర్ బాండ్లు అందజేస్తామని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం టీడీపీపై కక్షతో ప్రజలను ఇబ్బంది పెట్టిందన్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ఆగస్టు 15 నాటికి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఆర్థిక సహాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామాల్లో కూడా త్వరలోనే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో జేసీ గోపాల కృష్ణ, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ కే.వెంకటేశ్వరరావు, ఎంఈ ఐసయ్య, ఎంహెచ్‌ఓ డాక్టర్ వైష్ణవిత పాల్గొన్నారు.

విచారణలో వెనుకంజ

(5వపేజీ తరువాయి)

తావిస్తోంది. ఇటు ఆర్పీల తీరు, అటు అధికారుల ఉదాసీనత పరిశీలిస్తే విచారణ జాప్యంలో అధికారులు, భాగస్వాములు కుమ్మక్కయ్యారని తెలుస్తోంది. దీంతో పొదుపు గ్రూపుల్లోని కొందరు మహిళా సభ్యుల ఆధార్ కార్డును సీడింగ్ చేసి, రుణాలు పొందటంతో తమ పేరుతో ఉన్న బోగస్ గ్రూపు రుణాల కోసం బ్యాంకర్లు ఒత్తిడి చేస్తారనే ఆందోళనలో ఉన్నారు. బ్యాంకుల్లో దాచుకున్న ప్రజల సొమ్ము బురిడీ చేసి, దోచుకోవడంపై ఎలాంటి చర్యలూ లేకపోవడం అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైన పూర్తిస్థాయిలో విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పొదుపు సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వివరాల కోసం బ్యాంక్ ఆర్ఎంలకు లెటర్ రాశాం

ఒంగోలు నగరపరిధిలోని పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్లకు లేఖలు రాశాము. కొందరు వివరాలు ఇవ్వకపోవడంతో బ్యాంకు రీజనల్ మేనేజర్లకు లేఖలు రాశాము. వారి అనుమతితో త్వరలోనే అన్నీ వివరాలు సేకరిస్తాము. బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందిన ఆర్పీలు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ఈ నెలలో యోగాంధ్ర, డిజీ లక్ష్మి, ఇతర అనేక ప్రభుత్వ కార్యక్రమాలలో మెప్మా భాగస్వామ్యం ఉండటంతో కొంత జాప్యం ఏర్పడింది. త్వరలోనే పూర్తిస్థాయిలో విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాము.

- పి. శ్రీహరి, మెప్మా పీడీ

వచ్చే సీజన్ ఉత్పత్తి లక్ష్యంలో కోత

(5వపేజీ తరువాయి)

ప్రస్తుత సీజన్, వచ్చే సీజన్ పంట ఉత్పత్తి అనుమతి లక్ష్యాలు ఇలా ఉన్నాయి.

పొగాకు ఉత్పత్తి లక్ష్యాలివీ..

● దక్షిణాది తేలిక నేలలు(ఎస్ఎల్ఎస్) రీజియన్‌లో ప్రస్తుత సీజన్‌కు ఒక్కొక్క బ్యారన్‌కు 42.75 క్వింటాళ్ల వంతున 56.01 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతివ్వగా వచ్చే సీజన్‌కు బ్యారెన్‌కు 36.65 క్వింటాళ్ల వంతున 48.10 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి.

● దక్షిణాది నల్లరేగడి నేలలు (ఎస్‌బీఎస్) రీజియన్‌లో ప్రస్తుత సీజన్‌లో బ్యారెన్‌కు 41.75 క్వింటాళ్ల వంతున 49.26 మిలియన్లుకు అనుమతి ఇవ్వగా వచ్చే సీజన్‌కు బ్యారెన్‌కు 35.65 క్వింటాళ్ల వంతున 42.10 మిలియన్ కిలోలకు మాత్రమే అనుమతి ఇచ్చారు.

● ఇదే ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ రీజియన్లలో ప్రస్తుత సీజన్‌లో 62 మిలియన్లు ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా రానున్న సీజన్‌కు 51.70 మిలియన్ కిలోలకు అనుమతి ఇచ్చారు.

సురేష్ ఇంట్లోనే వ్యూహం

(5వపేజీ తరువాయి)

మధ్య ఇరువురు పరారయ్యేందుకు ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకున్నారు. వారిపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. 27 సాయంత్రం పోలీసు కస్టడీ ముగియడంతో కస్టడీకి తీసుకున్న నలుగురు నిందితులు వినోద్, సాంబశివరావు, నాగరాజు, రుత్వేంద్రబాబులను కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి అనంతరం జిల్లా జైలుకు తరలించారు.

అజ్ఞాతంలో సురేష్

వీరయ్య చౌదరి హత్య జరిగి రెండు నెలలు గడిచింది. ప్రధాన సూత్రధారి ముప్పా సురేష్ పోలీసులకు దొరకకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అనంతరం ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు. ఈనెల 30కి బెయిల్ పిటిషన్ న్యాయాధికారి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు సురేష్‌నుపట్టుకోవడం సవాల్‌గా మారింది.

అవీఇవీ

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాల యువతి సత్తా

జాతీయస్థాయిలో మూడోస్థానంలో నిలిచిన లక్ష్మి



పతకాలతో లక్ష్మి

చీరాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం దేవాంగిరిలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున బాపట్ల జిల్లా చీరాల పరిధిలోని పేరాలకు చెందిన ఎస్ లక్ష్మీ పాల్గొన్నారు. సత్తా చాటి మూడవ స్థానంలో నిలిచింది. జూనియర్ బాలికల విభాగంలో పాల్గొన్న శ్రీలక్ష్మీ 69 కేజీల విభాగం, బెంచ్ ప్రాజ్ 77 కిలోలు, డీడ్ ఫిట్ విభాగంలో పోటీల్లో పాల్గొన్నారు. మొత్తంగా మూడు విభాగాల్లో పాల్గొని 410 కేజీల బరువులు ఎత్తడంతో ఆమె మూడవ స్థానం దక్కించుకున్నారు. అందుకు సంబంధించి పతకాన్ని గురువారం కర్ణాటకలో అందుకుంది. దీంతో జిల్లా పరిధిలోని పలువురు ప్రముఖులు ఆమెను అభినందిస్తున్నారు.

పంటలకు బీమా చేసుకోవాలి

గిద్దలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకునే పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని, తద్వారా నష్టపోయిన సందర్భంలో పరిహారం పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. ఎకరాకు సంబంధించి వరిపంటకు రూ. 860, కంది పంటకు రూ. 430, సజ్జకు రూ.156, మినుములకు రూ. 205, నువ్వులకు రూ.180, పత్తికి రూ.2100, ఎండుమిరపకు ఎకరాకు రూ.4,500 ప్రీమియం చెల్లించి పంటల బీమా పొందవచ్చని పేర్కొన్నారు. వరి మినహా మిగతా పంటలకు జూలై 31వ తేదీలోగా, వరికి ఆగస్టు 15వ తేదీలోగా బీమా చేసుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబరు తీసుకుని మీ సేవా లేదా సీఎస్‌సీ సెంటర్లకు వెళ్లి పంటల బీమా చేసుకోవచ్చని తెలిపారు.

నీరు నిలబడకుండా చూడాలి



రోడ్డు మధ్యలో మురుగును పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్ల మధ్యలో మురుగు, వర్షపు నీరు నిలబడకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని రాజానగర్‌లో రోడ్డు మధ్యలో మురికినీరు, వర్షం నీరు నిలబడి ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిమెంటు రోడ్లపై కూడా నీరు నిలబడితే ఎలా అని ప్రశ్నించారు. పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువల్లోకి నీరు పోయే విధంగా చిన్నపాటి కాలువలను ఏర్పాటు చేయాలని సూచించారు. మాయా బజారులో కూడా ఆయన వీధులను పరిశీలించారు. పలు వీధుల్లో డ్రైనేజీలను ఆక్రమించుకుని మెట్లు, అరుగులు, ఇతర నిర్మాణాలు ఉండడాన్ని గమనించి వాటిని వెంటనే తొలగించుకోవాలని యజమానులకు సూచించారు. కాలువలపై నిర్మాణాలు చేపడితే వర్షం నీరు కాలువల్లోకి ఎలా పోతుందని ప్రశ్నించారు. ఆయన వెంట సచివాలయ, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

స్కూల్ వాహనాల్లో భద్రతా చర్యలు పాటించాలి



స్కూల్స్ యజమానులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్స్ వాహనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేటు స్కూల్స్ యజమానులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి వాహనంలో విధిగా ఎంవీఐ ధ్రువీకరించిన పత్రాలు ఉండాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు తప్పక వాహనంలో ఉండాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లు జరిగితే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, సీహెచ్ అహరోన్, పలు ప్రైవేటు స్కూళ్ల యజమానులు పాల్గొన్నారు.

కందకాల నాణ్యత పరిశీలన



కందకాలను పరిశీలిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి

కంభం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జలశక్తి అభయలో భాగంగా తురిమెళ్ల గ్రామంలో 2022-23 సంవత్సరంలో చేసిన చెలియకొండ-2లో కందకాల పని తీరును సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. చేసిన పని ఉపయోగంగా ఉన్నదీ, లేనిదీ ఆయన తెలుసుకున్నారు. కొండకు కందకాలు తీయడం వలన కొండ కింద పొలాలకు కోత పడకుండా, భూగర్భజలాలు పెరుగుతాయని రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీడీ భాస్కర్‌రావు, ఒంగోలు డీఆర్‌పీ ఇజ్రాయిల్, ఉపాధి హామీ కంభం ఏపీవో జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

'మార్కాపురం' అభివృద్ధికి నిధులివ్వాలి

ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే కందుల



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం రాత్రి సీఎంకు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా పట్టణం నుంచి రైల్వేస్టేషన్ వరకు చెరువుకట్టపై రహదారిని అభివృద్ధి పరచాలని కోరారు. అంతేకాక మార్కాపురం నుంచి తర్లుపాడుకు డబుల్ రోడ్డు, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇందిరమ్మ కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. త్రిపురాంతకం మండలం దూపాడు నుంచి కుడి కాలువ ద్వారా పట్టణానికి తాగునీటి అవసరాలు తీర్చే పైప్‌లైన్ అభివృద్ధి పనులకు కూడా తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చారు.

రుచిగా.. శుచిగా..


దొనకొండ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం
ఇష్టంగా తింటున్న విద్యార్థులు
హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

దొనకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు సన్నబియ్యాన్ని అధికారులు సరఫరా చేశారు. ఈ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రతి బస్తాకు క్యూఆర్ కోడ్‌తో ట్యాగ్‌ను ఏర్పాటు చేసి 25 కేజీల బస్తాను పాఠశాలలకు సరఫరా చేశారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీ పరిధిలో 69 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం 4,227 మంది విద్యార్థులు చదువుకుం



టున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నుంచి మధ్యాహ్న భోజనం సన్నబియ్యంతో తయారు చేయించి విద్యార్థులకు అందజేస్తున్నారు. విద్యార్థులు రుచికరంగా ఉందంటూ తృప్తిగా భోజనం చేస్తున్నారు. ఇంటి భోజనం లాగే ఉందని విద్యార్థులు ఆనందపడుతున్నారు. గతంలో లావు బియ్యంతో నిర్వహించే మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కొంతమంది ఇళ్లకు వెళ్లి తినిరావటం, మరికొందరు క్యారేజీలు తెచ్చుకొని తినేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తుండటంపై తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సన్నబియ్యంతో భోజనం బాగా ఉంది



ఎం.సాగర్‌బాబు, 9వ తరగతి, జడ్పీ హైస్కూల్, దొనకొండ

సన్నబియ్యంతో పెడుతున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండటంతో తృప్తిగా తింటున్నాం. గతంలో అన్నం ముద్దగా ఉండటంతో తినటానికి ఇబ్బందికరంగా ఉండేది.

గతంలో అన్నం ముద్దలా ఉండేది



ఎన్.లక్ష్మీప్రియాంక, 9వ తరగతి, జడ్పీ హైస్కూల్, దొనకొండ

ఇంతకుముందు అన్నం ముద్దలా ఉండటంతో తినటానికి కష్టంగా ఉండేది. ఇప్పుడు సన్నబియ్యంతో పెట్టే అన్నంతో పాటు కూరలు కూడా రుచికరంగా ఉంటున్నాయి. ఇంటి భోజనం లాగే ఎంతో బాగుంది.

జిల్లా అకడమిక్ క్యాలెండర్ విడుదల

ఒంగోలు విద్య, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్(విద్యా విషయక) క్యాలెండర్‌ను డీఈవో కిరణ్‌కుమార్, డీపీఈబీ కార్యదర్శి యం.శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నెలవారీగా విద్యా కార్యక్రమాలను అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోపాఠశాలల పనిదినాల సంఖ్య 233గా తేల్చారు. ఈ మొత్తంలో పాఠశాలల కనీసం 220కి తగ్గకుండా పనిచేయాలి. పాఠశాలలకు ఐచ్ఛిక సెలవులు 5, స్వయం నిర్ణాయక సెలవులు 3. ఈ సెలవులను సంబంధిత పర్యవేక్షనాధికారి అనుమతితో మాత్రమే వినియోగించుకోవాలి. జూలై 19న, ఆగస్టు 23న, సెప్టెంబర్ 20, అక్టోబరు 18, నవంబరు 22, డిసెంబరు 20, జనవరి 24, ఫిబ్రవరి 21న క్లస్టర్ సమావేశాలు నిర్వహించాలి.

- ఆగస్టు 4 నుంచి 7 వరకు జూన్, జూలై సిలబస్‌లో విద్యార్థులకు ఫార్మేటివ్ 1 పరీక్ష నిర్వహించాలి
- అక్టోబరు 13 నుంచి 16వ తేదీ వరకు ఆగస్టు, సెప్టెంబరు సిలబస్‌లో ఫార్మేటివ్ 2 పరీక్ష నిర్వహించాలి.
- నవంబరు 10 నుంచి 19 వరకు జూన్ నుంచి అక్టోబరు వరకు సిలబస్‌లో సమ్మేటివ్ అసైన్‌మెంట్ 1 పరీక్ష నిర్వహించాలి
- 2026 జనవరి 5 నుంచి 8 వరకు నవంబరు డిసెంబరు సిలబస్‌లో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ 3వ పరీక్ష నిర్వహించాలి
- ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు 10వ తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు
- ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు 1 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు జనవరి సిలబస్‌లో ఫార్మేటివ్ 4 పరీక్షలు జరుగుతాయి
- మార్చి 2 నుంచి 12 వరకు 10వ తరగతి విద్యార్థులకు పూర్తి సిలబస్‌లో గ్రాండ్ టెస్ట్‌ల నిర్వహణ
- ఏప్రిల్ 6 నుంచి 15 వరకు 1 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ 2(వార్షిక పరీక్షలు) జరుగుతాయి
- పాఠశాలలకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు దసరా సెలవులు ప్రకటిస్తారు. మైనారిటీ విద్యా సంస్థలకు సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు సెలవులు.
- క్రిష్టియన్ మైనారిటీ పాఠశాలలకు డిసెంబరు 25 నుంచి 28 వరకు సెలవులు
- సంక్రాంతి సెలవులు సాధారణ పాఠశాలలకు జనవరి 10 నుంచి 18 వరకూ క్రిస్టియన్ మైనారిటీ పాఠశాలలకు జనవరి 10 నుంచి 15 వరకు సెలవులు
- తరగతులకు నెలవారీ సిలబస్ ఇతర అంశాలు ఎస్సీఈఆర్టీ అకడమిక్ క్యాలెండరును అనుసరించాలి

విరివిగా రుణాలివ్వాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
రూ.25,045కోట్ల క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ


క్రెడిట్‌ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బ్యాంక్ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు, అల్పాదాయ వర్గాల వారు, స్వయంసహాయక సంఘాల మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పీఎం సూర్యఘర్ యోజన లబ్ధిదారులకు రుణాలను బ్యాంకర్లు విరివిగా మంజూరు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం బ్యాంకర్ల సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు రుణలక్ష్యాలను చేరుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు బ్యాంకర్లు సహకరించాలని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.25,045.91కోట్లుగా నిర్ణయించామన్నారు. గతేడాది జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం 123.57 శాతం సాధించడాన్ని అభినందించారు. ఈ ఏడాది పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్‌లో రూ.4,197.42కోట్లు, రబీలో రూ.6,040 కోట్లు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. మెప్మా ద్వారా ఈఏడాది ఒంగోలులోని 2620 గ్రూపులకు రూ.1004.80కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.681.85 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై వచ్చేనెల 1నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నిబంధనల ప్రకారం ఐదువేల జనాభా ఉండి బ్యాంకింగ్ సౌకర్యం లేని దర్శి మండలం పతకమూరు, పుల్లలచెరువు మండలం ముటుకుల, వైపాలెం మండలంలో వెంకట్రాద్రిపాలెం గ్రామాల్లో బ్యాంకుశాఖలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో లీడ్ మేనేజర్ రమేష్, వివిధ శాఖల అధికారులు నారాయణ, శ్రీహరి, శ్రీనివాసులు, రవికుమార్, అర్జునానాయక్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశ్రమలకు రూ.93.32 లక్షల రాయితీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి వివిధ రకాల రాయితీలకు 63 క్లైయిమ్‌లకు సంబంధించి రూ.93.32 లక్షలను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంజూరు చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రములు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటి సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సులభతర వాణిజ్య విధానంలో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఆయా శాఖలకు చెందిన నోడల్ అధికారులు ఈజ్ ఆఫ్‌డూయింగ్ బిజినెస్ సర్వేలో సానుకూలంగా స్పందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను నిర్దిష్ట గడువులోపు వరకు వేచి ఉండకుండా త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌ఏఎంపీ స్కీం ద్వారా జిల్లాలో వర్క్‌షాపులను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ పీఎంఈజీపీ పథకం అమలుపై సమీక్షించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పరిశ్రమల సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

వైసీపీకి 'దేవకి' రాజీనామా


దేవకి వెంకటేశ్వర్లు

కనిగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ వాసవీసత్ర సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. శుక్రవారం క్యాంపు ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న వాసవీసత్రాల నిర్వహణ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించే క్రమంలో వైసీపీకి సంబంధించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనలేనని చెప్పారు. వాసవీమాత కార్యక్రమాలకు, రాజకీయపార్టీ కార్యక్రమాలు రెండింటికి వ్యత్యాసం ఉన్నందున వైసీపీకి పూర్తిగా రాజీనామా చేస్తున్నానన్నారు. ఈమేరకు పార్టీ నాయకత్వానికి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులు దానం చేసిన గోవులు అమ్మకానికి..

సంరక్షకుడి ముసుగులో చదలవాడ సర్పంచ్ అకృత్యాలు
అడ్డుకున్న దేవస్థానం ఈవో, టీడీపీ నేత, గ్రామస్థులు
ప్రస్తుతం గోమాతలకు ఆంజనేయుడే దిక్కు...


ఆలనాపాలనా లేక పొలాల్లో ఉన్న గోవులు

నాగులుప్పలపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో గోమాతలను పూజించే సంస్కృతి మనది.. అవి అంటే ఎనలేని భక్తిభావం ఇమిడి ఉంది.. అలాంటి గోవులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తమకు తోచిన రీతిలో కాపాడుతుంటారు. అలాంటిది, కాషాయం ధరించిన వ్యక్తి సాక్షాత్తు గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ వాటిని అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగులుప్పలపాడు మండలం చదలవాడలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళితే...


దాతల సహకారంతో గోవుల కోసం నిర్మించిన షెడ్

నిత్యం కాషాయి వస్త్రాలు ధరించి ఉండే చదలవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ దాసరి వరప్రసాదరావు కొన్నేళ్ల క్రితం చీర్వానుప్పలపాడురోడ్డులోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మఠంలో వృద్ధాశ్రమం నడుపుతుండేవాడు. అప్పట్లో దేవస్థానానికి పలువురు భక్తులు, దాతలు గోవులను దానంగా ఇచ్చారు. వాటి సంరక్షణకు అవసరమైన గడ్డి, తవుడు ఇతరత్రావి కూడా దాతలే సమకూర్చుకొంటూ వస్తున్నారు. గోవుల సంరక్షణకు భక్తుల సహకారంతో షెడ్లను కూడా నిర్మించారు. కొద్ది రోజుల క్రితం వృద్ధాశ్రమం మూతపడింది. మొత్తం 22 గోవులున్నాయి. ఇటీవల వాటిని చిలకలూరిపేటకు చెందిన కొందరు వ్యక్తులకు సర్పంచ్ అమ్మకానికి పెట్టారు. వాటిని లారీలలో ఎక్కించి తరలించే ప్రయత్నం చేస్తుండగా దేవస్థాన ఈవో అనిల్‌కుమార్, గ్రామ టీడీపీ నాయకులు బోయిడి బ్రహ్మరాజు, పలువురు గ్రామస్థులు అడ్డుకోవడంతో వ్యాపారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దేవస్థానానికి దాతలు ఇచ్చిన గోవులను అమ్ముకోవడం మంచి పద్ధతి కాదని సర్పంచ్‌ను ఈవో అనిల్ హెచ్చరించారు. దీంతో సర్పంచ్ గోవుల సంరక్షణ బాధ్యత తాను తీసుకోనని, వాటి కోసం నిర్మించిన షెడ్లలోని ఫ్యాన్లు, ఇతర సామన్లను తొలగించారు. ఇన్నాళ్లు గోవుల సంరక్షణ చూసింది తానేనని, వాటిపై హక్కు తనకే ఉందని తనను అమ్ముకోనివ్వకుండా అడ్డుకొంటున్నారని రెండు రోజుల అనంతరం ఈవోపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు కూడా వెనకాడలేదు. ఆ విషయం ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో తేల్చుకోవాలని పోలీసులు సలహా ఇవ్వడంతో గోవుల ఆలనాపాలనాను వదిలేశారు. వాటి దుస్థితికి చలించిన గ్రామానికి చెందిన ఓ రైతు వాటి సంరక్షణను చూస్తున్నారు. దాంతో సర్పంచ్ తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు.


గోవులను తరలించేందుకు తీసుకొచ్చిన లారీలు(ఫైల్)

అంగన్వాడీ కేంద్రాలలో పక్కాగా పౌష్టికాహారం

1 నుంచి లబ్ధిదారులకు ముఖ ఆధారిత గుర్తింపు


అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లులు, సిబ్బంది (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పక్కదారి పడుతున్నందున పారదర్శకతకు పెద్దపీట వేసేలా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ జూలై 1వ తేదీ నుంచి ముఖ ఆధారిత గుర్తింపును ఆచరణలోకి తీసుకురానుంది. లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసేటప్పుడు, ఆహార పంపిణీ సమయంలో పోషణ్ ట్రాకర్ యాప్‌లో ముఖ గుర్తింపు తప్పనిసరి కానుంది.

ఎర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలో ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 248 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 221 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు కాగా 27 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 215 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 217 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. 27 మినీ అంగన్వాడీ కేంద్రాలకుగాను 26 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆయా కేంద్రాలలో మూడేళ్లలోపు చిన్నారులు 26,798.. మూడు నుంచి ఆరేళ్లలోపు 5,459 చిన్నారులు ఉన్నారు. అలాగే గర్భిణులు 1,186, బాలింతలు 989 ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా అంగన్వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ఇలాంటి యాప్ (ముఖ ఆధారిత)లను, పనిభారం తగ్గించాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రజాప్రభుత్వానికి ఆశీస్సులు అందించండి

మంత్రి డాక్టర్ వీరాంజనేయస్వామి
సింగరాయకొండలో రూ.61 లక్షలతో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్‌కు కలెక్టర్‌తో కలిసి భూమిపూజ
త్వరలో ఈనాం భూముల సమస్యకు పరిష్కారం

సింగరాయకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ప్రజాప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు ఇవ్వాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఎదురు రూ.61 లక్షలతో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్‌కు కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో కందుకూరు రోడ్డు సెంటర్‌లో అన్నాక్యాంటీన్ నిర్మాణాన్ని ప్రారంభించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపేసిందని తెలిపారు. ప్రస్తుతం అన్నాక్యాంటీన్ల డిజైన్ మారినందున ఆస్థలం సరిపోకపోవడంతో మార్చామన్నారు. కార్మికులు, పేదలు అధికంగా ఉండే ఇక్కడే తొలిప్రాధాన్యతగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్యాంటీన్‌లో రూ.5 ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడతారన్నారు. గుంతలమయంగా ఉన్న ట్రంకురోడ్డు నిర్మాణానికి మార్చి తరువాత బడ్జెట్‌లో నిధులు తీసుకొచ్చి పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రజల ఎదుర్కొంటున్న ఈనాం భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మంత్రుల ఉపసంఘం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మూలగుంటపాడు భూముల రిజిస్ట్రేషన్ సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ మూడు నెలల లోపు అన్నా క్యాంటీన్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. అనంతరం ఎస్సీ బాలుర వసతిగృహం ఆధునికీకరణ పనులను వారు పరిశీలించారు. అనంతరం వాడుకలో లేని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పరిశీలనకు వెళ్లగా తాళాలు వేసి ఉండటంతో వినియోగంలోకి తీసుకొచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. తదనంతరం నిర్మాణంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎంపీడీవో జయమణి, టీడీపీ మండల అధ్యక్షుడు సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, గాలి హరిబాబు, బ్రహ్మయ్య, గిరి, గుదే వెంకటేశ్వర్లు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

నూతన సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి, జూన్27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగోలు గ్రామంలో నూతన సచివాలయ, గ్రామ పంచాయతీ భవనాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. గడచిన టీడీపీ ప్రభుత్వంలో రూ.పది లక్షలతో మొదలు పెట్టిన భవన నిర్మాణాన్ని తర్వాత వచ్చిన ప్రభుత్వం వదిలేసింది. తిరిగి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక మరో రూ.25 లక్షలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేసింది. వైసీపీ హయంలో నిర్మించిన సచివాలయ భవనం గ్రామానికి దూరంగా ఉండి, ప్రజలకు అసౌకర్యంగా మారింది. దీంతో గ్రామంలో పూర్తి చేసిన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రజలకు సౌకర్యవంతంగా భవనం ఉండటంతో సచివాలయ సిబ్బంది ఈ భవనం నుంచే సేవలు అందించాలని ఈసందర్భంగా మంత్రి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

కలెక్టర్ అన్సారియాకు శుభాకాంక్షలు



కలెక్టర్ అన్సారియాను అభినందిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్‌గా ఏడాది కాలం పూర్తి చేసుకున్న తమీమ్ అన్సారియాను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి మహిళావింగ్ నాయకులు అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్ అన్సారియాను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఊతకోలు శ్రీనివాసులు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రశాంత్, జేఏసీ మహిళా వింగ్ చైర్మన్ జయలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : బీఎన్



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పథకం పేదలకు ఓ వరమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని 16 గ్రామాలకు చెందిన 32మందికి మంజూరైన రూ.14,17,899 సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ శుక్రవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్విస్‌లో ముగిసిన అధ్యాపకుల శిక్షణ



శిక్షణకు హాజరైన అధ్యాపకులతో నిర్వాహకులు

ఒంగోలు(రూరల్), జూన్27(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ (చెన్నై), ఎఫ్‌డీఎఫ్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులు నుంచి జరుగుతున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయిత్రీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులకు బోధన చేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గిరిధర్, అనిల్‌కుమార్, సెల్వం, కళాశాల డీన్ సత్యమెహర్, ప్రిన్స్‌పాల్ హనమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే మహాసభలు జయప్రదంపై కృతజ్ఞతలు

ఒంగోలు కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) :ఒంగోలులో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, పాత్రికేయులకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ.రమణ, దాసరి కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ సమావేశాల నిర్వహణలో మార్గదర్శిగా నిలిచిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావుకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.

మెగా డీఎస్సీకి 80శాతం మంది హాజరు

ఒంగోలు(విద్య), జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు శుక్రవారం 80శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాలలో ఉదయం సెషన్స్‌లో మాత్రమే పరీక్ష జరిగింది. 831మందికి 664మంది హాజరుకాగా 167మంది గైర్హాజరయ్యారు.

నేటితో ముగియనున్న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), జూన్27(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులలో ప్రవేశాలకు ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ శనివారంతో ముగియనున్నది. శుక్రవారం లక్షా 4వేల నుంచి లక్షా 20వేల ర్యాంక్ వరకు 119మంది విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. శనివారం చివరిరోజు లక్షా20వేల ఒకటి నుంచి చివరి ర్యాంక్ వరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పాలిటెక్నిక్ ప్రిన్స్‌పాల్ శివప్రసాద్ తెలిపారు.

బంగారు వ్యాపారుల మధ్య విభేదాలు.. నేడు బంద్‌కు పిలుపు



గాంధీరోడ్‌లో గుంపులుగా చేరిన వ్యాపారులు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని బంగారు వ్యాపారుల మధ్య విబేధాలు చోటు చేసుకున్నాయి. ది గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా ప్రసాద్‌పై అసోసియేషన్ సభ్యులైన కొల్లిపల్లి సురేష్, హనీష్, కొప్పురావూరి హరిప్రసాద్‌తోపాటు భరత్‌సింహ అనే వ్యాపారులు దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలిసింది. బంగారు వ్యాపారుల సంఘం ఎన్నికల విషయంలో తలెత్తిన విబేదాలు నేపథ్యంలో శుక్రవారం రాత్రి వీరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. దీంతో ప్రసాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ప్రసాద్ దుకాణంపై దాడి చేయడంతో నిరసనగా శనివారం మధ్యాహ్నం 2గంటల వరకు బంగారు వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చారు.

పల్లెసీగలో ప్రగతిసిరి!

● నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి స్వామి





రూ.8.50కోట్లతో పూర్తయిన పృధులగిరి తారురోడ్డు, గార్లపేటలో రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు

మర్రిపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పల్లెసీమల్లో ప్రగతిపనులు జోరందుకున్నాయి. ముఖ్యంగా ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో వేసిన సిమెంట్‌రోడ్లు పల్లెలకు సరికొత్తశోభను సంతరించుకుంటున్నాయి. 3.25 కిలోమీటర్ల ద్వారా రూ.2.8కోట్లతో సిమెంట్‌రోడ్డు నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. మండలంలోని అయ్యపురాజుపాలెంలో 40, రామయపాలెంలో 30, రావెళ్ళవారిపాలెం 30, తంగెళ్ళ 30, ధర్మవరం 30, మర్రిపూడిలో 50, గుండ్లసముద్రంలో 20, కెల్లంపల్లి 20, గార్లపేట రూ.50 లక్షలతో రహదారి నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి ఊసే కనిపించలేదు. అంతర్గత రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో వాటి పరిస్థితి అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే రహదారులు చిత్తడిగా మారి గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి స్వామి గ్రామీణ రహదారులపై దృష్టికి సారించారు. ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు కావడంతో పృదులగిరిపై 200 మీటర్ల సిమెంట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. రహదారి 30 మీటర్ల వెడల్పుతో సువిశాలంగా ఏర్పాటు చేయడంతో వాహనాల పార్కింగ్ సమస్య తీరింది. అంతే కాకుండా గోశాల సమీపంలో కల్వర్టు నిర్మించడంతో వరదనీరు సెలయేరు ద్వారా కొండ కిందకు చేరుకుంటుంది. మరో రూ.30 లక్షలతో పృదులగిరిపైన సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి మంత్రిస్వామి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.8.50కోట్లతో మర్రిపూడి నుంచి పొదిలి మండలం జువ్వలేరు యానాదికాలనీ వరకు 10.5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణ పనులు మంజూరయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ రహదారి పనులను ఆగమేఘాలపై ప్రారంభించారు. అయితే అటవీ అనుమతులు రాకపోవడంతో రహదారి నిర్మాణ పనులకు అవరోధం ఏర్పడింది. బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడంపై జాప్యం వహించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో స్థానిక శాసనసభ్యులు స్వామి రాష్ట్ర మంత్రివర్గంలో చోటుదక్కించుకోవడంతో అటవి అనుమతులను ఇప్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. తారురోడ్డు నిర్మాణ పనులు నూతన ప్రభుత్వ హయాంలో పూర్తి అయ్యాయి. గార్లపేటలో ఎన్నోఏళ్ళుగా ఎస్సీకాలనీ వాసులు సరైన రహదారిలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పక్కారోడ్డు నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. రూ.50లక్షలతో 600 మీటర్లకుపైగా సిమెంట్‌రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. అద్వానంగా ఉన్న కూచిపూడి గార్లపేట ఆర్ అండ్‌బీ రహదారి అభివృద్ధికి రూ.1.08 కోట్లు నిధులు మంజూరు చేయించారు. మొత్తంమీద మండలంలో పలురహదారుల అభివృద్ధి వేగంగా జరుగుతుండటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పృధులగిరి అభివృద్ధి పనులకు మంత్రిస్వామి ప్రారంభోత్సవం చేయనున్నారు.

క్షయ నిరోధానికి అందరూ కృషి చేయాలి

● జిల్లా టీబీ యూనిట్ అధికారి శ్రీవాణి



ఘుడియపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

మద్దిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని నిరోధించటానికి కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని జిల్లా టీబీ యూనిట్ అధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఘడియపూడి, గార్లపాడు గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వ్యక్తులకు దుర్వసనాలు, పౌష్టికాహార లోపం వల్ల టీబీ వస్తుందన్నారు. వారం రోజులపాటు దగ్గుతో బాధపడే వారిని గుర్తించి వారికి కళ్లె పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు. మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను గ్రామానికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఆనంద్‌మోహన్ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి టీబీ నమూనాలు తీసుకుంటారని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రమౌళి, డాక్టర్ అన్వేష్, లలితమ్మ, రజితకుమారి, బాలకోటయ్య, నాగరాజు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చెత్తాచెదారం ఉంటే చర్యలు

● డీపీవో వెంకటనాయుడు



సర్వేరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు



బిట్రగుంటలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఒంగోలు(రూరల్), జూన్27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతే చర్యలు తీసుకుంటామని డీపీవో వెంకటనాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో గ్రామంలోని వీధులను సందర్శించి పరిశుభ్రంగా ఉండటంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం చెత్త సంపద తయారు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. ఇంటిపన్నులు వసూలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ పరిశీలన

జరుగుమల్లి: ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం ప్రతిరోజూ అన్ని గ్రామాల్లో చేయాలని ఎంపీడీవో రమణమూర్తి ఆదేశించారు. మండలంలోని కె.బిట్రగుంట గ్రామంలో శుక్రవారం ఇంటింటికి చెత్త సేకరిస్తున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వావిలేటిపాడు గ్రామంలో ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో జీవీ కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌బాబు పరిశీలించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

మద్దిపాడు: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇందుకు సర్పంచ్‌లు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస ప్రసాద్ కోరారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో చెత్త సేకరణ పనులను చేపట్టాలని, వీధులు పరిశుభ్రంగా ఉండేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవోఆర్డీ కె.రఘుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు మండవ శివానందరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య

● ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ



మాట్లాడుతున్న డైరెక్టర్ సువర్ణ

మద్దిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు బోధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఆటపాటలు, బొమ్మలతో వారికి విద్యను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అంగన్‌వాడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ తెలిపారు. శుక్రవారం లింగంగుంట అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ విద్యకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని చెప్పారు. చిన్నారులకు ఆటపాటలతో చదువుపై దృష్టి సారించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు నూరు శాతం ఫేస్ రికగ్నిజేషన్ నమోదు చేయాలని, ప్రతి ఒక్కరికీ బ్యాంక్ అకౌంట్‌లో ఈకేవైసీ చేసేలా చూడాలన్నారు. సీడీపీవో ఇవాంజెలిన్ మాట్లాడుతూ చిన్నారులకు అత్యున్నత బోధన అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎస్.వెంకట్, సూపర్‌వైజర్లు జ్యోతి, పద్మావతి, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ మహామేళాను విజయవంతం చేయాలి

● ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు బ్రహ్మయ్య



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మయ్యమాదిగ

నాగులుప్పలపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జూలై 7న నిర్వహించే మాదిగ మహామేళాను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ కోరారు. ఎంఆర్‌పీఎస్ ఉద్యమగడ్డ ఈదుమూడి గ్రామంలో మాదిగ మహామేళా పోస్టర్లను బ్రహ్మయ్యమాదిగ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి రెండు తెలుగు రాష్ట్రాలలో సాధించుకోవడం జరిగిందన్నారు. ఉద్యమ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో జరిగే మహామేళాలో మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గరటయ్య, రోశయ్య, మువంగర నాగార్జున, నాగేశ్వరరావు, మున్నంగి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందజేత



సామగ్రిని పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

చీమకుర్తి, జూన్27(ఆంధ్రజ్యోతి) : బండ్లమూడిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈవోలు నరసింహారావు, శివాజీలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రోటరీ క్లబ్ చేయూత అభినందనీయం అన్నారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు చేతుల మీదుగా నోటు పుస్తకాలు, కాపీరైటింగ్ పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ భాస్కరశాస్త్రి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ, కార్యదర్శి కందుకూరి సుధాకర్, ప్రతినిధులు పోకూరి రామకృష్ణారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, సత్యం, శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అనిల్‌బాబు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు(విద్య), జూన్27(ఆంధ్రజ్యోతి): బడి బయటి పిల్లలను స్కూళ్లలో చేర్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తల్లితండ్రులకు వివరించాలని కోరారు. ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25శాతం అడ్మిషన్లు కల్పించటం గురించి ప్రచారం చేయాలని, ఎస్సీ ఎస్టీ పిల్లలను చేర్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నగర కమిషనర్‌కు ప్రశంసలు



వెంకటేశ్వరరావును అభినందిస్తున్న నాయకులు, జర్నలిస్ట్ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర సుందరీకరణ, పారిశుధ్యం మెరుగుపై పలువురు ప్రముఖులు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 25,26 తేదీలలో ఒంగోలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీయూడబ్ల్యూజే) 36వ రాష్ట్ర మహాసభల సందర్భంగా విచ్చేసిన తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్ఎన్.సిన్హా, ఐజేయూ జనరల్ సెక్రటరీ బల్వీందర్‌సింగ్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు నగరంలో సుందరీకరణ, పారిశుధ్యం మెరుగుపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావును అభినందించారు. అలాగే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ కమిషనర్‌ను సత్కరించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఒంగోలు విచ్చేసిన రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణకు వినతిపత్రం అందజేసింది. కార్పొరేషన్‌లోని శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను యూనియన్ నాయకులు మంత్రికి వివరించారు. సమస్యలను సానుకూలంగా ఆలకించిన మంత్రి నారాయణ పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యహరిశ్చంద్ర నాటకం

ఒంగోలు కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నవ్యకళాకృతి ఆదర్శ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు అకాడమీ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ పౌరాణిక నాటకంలో ఆర్.శ్రీనివాసరావు, ఎం.శాంతారావు, నాగేశ్వరరావు, తక్కెళ్లపాడు మీరావలి, గూడూరు సుధారాణి, శాంతి, ఆదినారాయణనాయుడు, నరసింహారావు, నారాయణరావు, దరిశి శ్రీనివాసరావు, ఒంగోలు రత్తయ్య, డి.సరోజిని వంటి సీనియర్ నటీనటులు పాల్గొంటారన్నారు. కనుక కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

మద్దిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటలు పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏపీవో ధనుంజయవర్మ శుక్రవారం తెలిపారు. 5 ఎకరాల లోపు ఉన్న ఎస్సీ ఎస్టీ, బీసీ రైతులకు వందశాతం రాయితీతో ఉపాధి నిధులను వెచ్చించి పండ్ల తోటలు పెంపకానికి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఎరువులు, పురుగుమందులు అందజేస్తామని, ఎకరానికి రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. 18 రకాల పండ్ల తోటలకు, రెండు రకాల పూల తోటలు సాగు, మునగ పంటతో కలిపి 21 రకాల మొక్కలు పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు పండ్ల మొక్కలు సంరక్షణ చేస్తే వారి ఖాతాలకు నగదు జమ చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మామిడిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



మాట్లాడుతున్న ఈఈ హరిబాబు

ఒంగోలు క్రైం, జూన్27 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు మామిడిపాలెం సబ్‌స్టేషన్‌లో రూ.1.30 కోట్లు విలువగల ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు ఆశాఖ ఈఈ ఎం.హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌లను చార్జ్ చేసిన అనంతరం మాట్లాడుతూ మామిడిపాలెం ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీఈలు తోటా శ్రీకాంత్, వినయ్‌కుమార్‌రెడ్డి, ఏఈ రవిప్రకాష్, లైన్ ఇన్‌స్పెక్టర్ జయకర్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



మందు తాపిస్తున్న పశువైద్యాధికారి శివరామకృష్ణ

పొన్నలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. పశువైద్యాధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ సీజన్‌లో గొర్రెల్లో చిటిక, నీలినాలుక వ్యాధి వ్యాపించే అవకాశం ఉందన్నారు. వీటిని అరికట్టేందుకు ఉచితంగా టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మాచవరం పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

నాగులుప్పలపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాచవరం జడ్పీ హైస్కూలు పాఠశాలను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర రాష్ట్ర పరిశీలకుడు పి.రమేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఈ ఏడాది అందించిన విద్యా కిట్లు సక్రమంగా అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.శివరామప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలానికి రక్షణ కరువు

అసాంఘిక కలాపాలకు అడ్డాగా బస్‌షెల్టర్
ఫెన్సింగ్ లేకపోవడంతో ఆక్రమణలు


విలువైన స్థలాన్ని నిరుపయోగంగా వదిలేసిన ఆర్టీసీ యాజమాన్యం

పొదిలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పొదిలి - దర్శి ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న 20 కోట్లకుపైగా విలువ చేసే 1.50 సెంట్ల ఆర్టీసీ స్థలానికి రక్షణ కరువైంది. పట్టణంలో జాగా కనిపిస్తే వేసేయ్ పాగా అన్నట్లు ఉన్న పరిస్థితుల్లో కూడా ఆర్టీసీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో స్థలం ఆక్రమణలకు గురవుతోంది. ఆప్రాంతంలో సెంటుస్థలం రూ. 15 లక్షలకుపైగా ధరపలుకుతోంది. 35 సంవత్సరాల క్రితం నిర్మమహేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూమిలో వాసవి కన్యకా పరమేశ్వరి దుకాణ సముదాయాన్ని నిర్మించారు. అప్పట్లో ప్రజల సౌకర్యం కోసం దుకాణ సముదాయం పక్కనే ఉన్న 1.50 ఎకరాల భూమిని ఆర్టీసీ బస్టాండ్ కోసం పంచాయతీ పాలకవర్గం కేటాయించింది. అప్పట్లో బస్సుల రాకపోకలకోసం బస్‌షెల్టర్ నిర్మించారు. దుకాణాలు పొందిన వ్యాపారులు అక్కడ తమ వ్యాపార సంస్థలను ప్రారంభించకపోవడంతో దుకాణ సముదాయం వెలవెలబోయింది. ఈనేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ కూడా నిరుపయోగంగా మారింది. ఆర్టీసీకి అప్పగించిన స్థలంలో బస్సుల రాకపోకలు లేకపోవడంతో తిరిగి తమస్థలాన్ని పంచాయతీకి అప్పగించాలని అప్పటిపాలకవర్గం కోరింది.కాని స్పందించలదు. దీంతో రాత్రి వేళల్లో బస్సుషెల్టర్‌ను మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. సమీప గృహయజమానులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వినియోగించుకుంటున్నారు. ఉత్తరం వైపు కొంతమంది స్థలాన్ని ఆక్రమించుకొని కట్టడాలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం పర్యవేక్షణ

పట్టణంలోని స్థానిక రథం రోడ్డులో ఉన్న ఆర్టీసీ స్థలాన్ని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. స్థలం పరిరక్షణకు ఉన్నతిధికారులకు నివేదిక పంపించాం. అంతే కాకుండా నగరపంచాయతీ కమిషనర్‌తో మాట్లాడి పట్టణ అభివృద్ధిలో భాగంగా సైడు తొలగిస్తున్న మట్టిని తోలాలని కోరాం. ఆవిధంగా మట్టితో చదును చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ఆర్టీసి ఉన్నతాధికారుల అనుమతితో రక్షణ చర్యలు చేపడతాం.

- పొదిలి ఆర్టీసీ డీఎం శంకరరావు

పురాతన కోనేరులను అభివృద్ధి చేయిస్తా

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు


కోనేరు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన కోనేరులను అభివృద్ధి చేయించి, ప్రాచీన సంస్కృతిని నేటి తరానికి ప్రదర్శనగా ఉంచుతామని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం శివాలయం వీధిలో ఉన్న కోనేరు అభివృద్ధి పనులు శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎర్రగొండపాలెంలో 3 కోనేర్లు ఉన్నాయని, ప్రజల కోరిక మేరకు వాటిని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, అర్చకులు శ్రీ రామచంద్రమూర్తి, టీడీపీ నాయకులు సత్యనారాయణగౌడ్,తోట మహేష్, కొత్తమాసు సుబ్రమణ్యం, పట్టణ అధ్యక్షుడు పి. మల్లికార్జునరావు, మేకల శ్రీను, ఒంగోలు ఆదిరెడ్డి పాల్గొన్నారు.

2 న మండల పరిషత్ సమావేశం

ఎర్రగొండపాలెం మండలపరిషత్ సర్వసభ్యసమావేశం జూలై 2 వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీవో బి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో అభివృద్ధి పనులకు సంబంధించి అన్ని పథకాలపై చర్చ జరుగుతుందని, మండల లెవెల్ అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

గిద్దలూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకొండపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు మొర్రి పిచ్చయ్య, జక్కా రమాదేవి, జగజ్జీవన్ కుమార్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

ట్రాక్టర్‌లో దూరిన పాము

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో ఆగివున్న ట్రాక్టర్‌లో శుక్రవారం పాము దూరింది. ఎంతసేపటికి బయటకి రాకపోవటంతో స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు ట్రాక్టర్ డ్రైవర్ సమాచారం ఇచ్చారు. దీంతో నిరంజన్ ట్రాక్టర్ బ్యానెట్ ఓపెన్ చేసి చాకచక్యంగా పామును పట్టుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ పాములు కనిపిస్తే వాటికి హాని చేయవద్దని, తమకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని అడవులలో వదిలి వేస్తామన్నారు. పాములు పర్యావరణ పరిరక్షణకు ఎంతో తోడ్పడతాయన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రాచర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగారెడ్డిపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాలను గిద్దలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శివ వెంకటరామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హర్షగౌడ్, వీఆర్వోలు ఎస్. రంగయ్య, కె లక్ష్మీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం ఏర్పాటు అభినందనీయం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో బాలికల వసతి గృహం ఏర్పాటుకు ఎంతో కృషి చేసి అనుమతి మంజూరు చేయించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి బీజేపీ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు టి.సురేష్ అభినందనలు తెలిపారు. జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బొంతల కృష్ణ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా బీసీ బాలికలు వసతి గృహం లేని కారణంగా 5వ తరగతి తరువాత నిలిపివేస్తున్న దుర్భర పరిస్థితులలో బాలికల విద్యాభివృద్ధికి సహకరించిన కూటమి ప్రభుత్వ శాసనసభ్యులు, సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి చిన్నయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ వింగ్ కన్వీనర్ కె.రాజా శ్రీకాంత్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఓబీసీ నాయకులు

అక్కపల్లెలో గంజాయి పట్టివేత

బేస్తవారపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలంలోని అక్కపల్లె గ్రామంలో అక్రమంగా కలిగి ఉన్న 25 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి గోవిందారెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. గోవిందారెడ్డికి గంజాయి అమ్మిన మామిళ్ల శ్రీనివాసులు అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

నూతన ఒరవడిని అందిపుచ్చుకోవాలి

డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు

పెద్దారవీడు, జూన్27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విధానాలను అందిపుచ్చుకోవాలని డిప్యూటీ డీఈవో మామిళ్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రధానాపాధ్యాయులతో నూతన విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థ అభ్యున్నతికి నూతన ఒరవడిని తీసుకువస్తున్నదన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో అన్నీ వసతులు కల్పిస్తామని, వాటిలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎస్సై అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసులు, ఎస్.సుబ్రమణ్యం, క్లస్టర్ ఇంచార్జిలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు

యడవల్లి విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు


సుమంత్

రాచర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన మొర్రి సుమంత్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో కడప జిల్లాలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో సీటు వచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సుమంత్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

2 గంటలు కూర్చునే ఓపిక లేకపోతే ఎలా ?

కంభం మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన ఎంపీపీ

కంభం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి ప్రజాసమస్యలపై జరిగే మండల పరిషత్ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులక 2 గంటలు కూర్చునే ఓపిక లేకపోతే ఎలా అని ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన కంభం మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల సమావేశం పూర్తయ్యే వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించాలన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ సమావేశానికి ఏఏ శాఖల అధికారులు గైర్హాజరయ్యారో వారికి నోటీసులు పంపిస్తానన్నారు. అనంతరం ఉపాధి హామీపై చర్చ జరిగిన చర్చలో ఏపీవో జీవరత్నం మాట్లాడుతూ మండలంలో 6,315 మంది జాబ్‌కార్డులు కలిగి పనులకు వస్తున్నట్లు తెలిపారు. ఎల్.కోట సర్పంచ్ ఖాశింవలి మాట్లాడుతూ లింగోజిపల్లిలో వారం రోజులుగా ఉపాధి పనులు జరుగడం లేదని, పైగా పనికి వచ్చే ఒక్కో మనిషి దగ్గర 100 రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. యర్రబాలెంలో వారం రోజుల నుంచి పనులు జరుగడం లేదని, ఒకవేళ పనులు మొదలు పెడితే 500 ఎకరాలకు పైగా సాగునీరు అందించే పంట కాలువలు పూడిపోయాయని, వాటిని ఉపాధి పనుల కింద బాగు చేయాలని సర్పంచ్ శ్రీనివాసులు కోరారు. చిన్నకంభంలో కూడా పనులు నిలిపివేస్తున్నట్లు సర్పంచ్ రసూల్ తెలిపారు. రేషన్‌పై జరిగిన చర్చలో కోఆప్షన్ మెంబర్ సలీమ్ మాట్లాడుతూ రేషన్ దుకాణాల ప్రారంభం రోజే ఓ డీలర్ ఉదయం 8గంటలకు షాపు తెరచి 9గంటలకు మూసివేసి వెళ్లాడని తెలపగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవోకు లేఖ పెట్టినట్లు తెలిపారు. ఇంకా ఈకార్యక్రమంలో అన్ని శాఖలపై చర్చ జరిగింది.

పారిశుధ్య పనుల పరిశీలన

బేస్తవారపేట,జూన్27(ఆంధ్రజ్యోతి):బేస్తవారపేట గ్రామ పంచాయతీ, చెట్టిచెర్ల గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం ఉదయం ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, కార్యదర్శి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రజలు చెత్తను రోడ్లపై, ముల్లకంపల్లో పారవేయవద్దని అన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

రాచర్ల: గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన మండలంలోని సోమిదేవిపల్లి, అనుములవీడు, రాచర్ల గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. మండల విస్తరణ అధికారి ఐ. వెంకటేష్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంద్ర బస్సును నడపాలి

కంభం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఇంద్రబస్సును కంభం, మార్కాపురం మీదుగా హైదరాబాద్‌కు నడపాలని రాష్ట్రషెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు విజయవాడలో ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు వినతిపత్రం అందచేశారు.

అవీ..ఇవీ


అమ్మవారికి ఒడిబియ్యం తీసుకుని వెళుతున్న మహిళలు

వైభవంగా ఒడిబియ్యం, కుంకుమ పూజ

గిద్దలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాడమాసం పూజలు ప్రారంభమయ్యాయి. మహిళా మండలి అధ్యక్షురాలు బాదం పుష్ప ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు వాసవి కల్యాణ మండపం నుంచి అమ్మవారికి ఒడిబియ్యాన్ని మేళతాళాల మధ్య అమ్మవారి శాలకు తీసుకుని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం మహిళలు శ్రీవాసవీ మాతకు ఒడిబియ్యం పెట్టారు. అనంతరం సామూహికంగా జరిగిన కుంకుమ పూజ కార్యక్రమాలలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి పల్లకీ సేవను నిర్వహించారు. దేవస్థాన అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శి దమ్మాల జనార్దన్, కమిటీ ప్రతినిధులు, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.


చావిడిలో కొలువైన పీర్లు

తిమ్మాపురంలో మొహర్రం వేడుకలు ప్రారంభం

పెద్దదోర్నాల,జూన్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మొహర్రం వేడుకలు శుక్రవారం ప్రారంభించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు. ఆరు రోజుల వరకు విడి సరిగెత్తులు నిర్వహించి, ఏడవ రోజున చిన్న సరిగెత్తు, పదవ రోజున పెద్ద సరిగెత్తు, పదకొండవ రోజున పీర్లు ఏటికి వెళ్ల వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పెద్ద సరిగెత్తు రోజున అగ్ని గుండం పేర్చి హోమం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి వేకువ జామునే ఉపవాస దీక్షలు చేపట్టి రాత్రి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. గ్రామంలో ముజావరి తప్ప ముస్లింలు లేకపోయినా కులమతాలకు అతీతంగా హిందువులే వేడుకలు నిర్వహించడం విశేషం.


ఎక్స్‌కవేటర్‌తో పారిశుధ్య పనులు చేయిస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

సొంత నిధులతో పారిశుధ్య పనులు

మార్కాపురం రూరల్, జూన్27 (ఆంధ్రజ్యోతి). మండలంలోని బోడపాడు గ్రామ ప్రభుత్వ పాఠశాల వద్ద మురుగు నీరు నిల్వ ఉండటంతో గ్రామ టీడీపీ నాయకుడు బొగ్గు శేఖర్‌రెడ్డి తన సొంత నిధులతో శుక్రవారం ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటుచేయించి పారిశుధ్య పనులను దగ్గర ఉండి చేయించారు. గ్రామంలో మురికి నీరు అంతా అక్కడకు చేరుకుని నిల్వ ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన టీడీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటుచేశాడు. పాఠశాలకు వెళ్లే దారిలో మురికి నీరు నిల్వ ఉండటంతో గొట్టాన్ని ఏర్పాటు చేయించి బయటకు వెళ్లే మార్గాన్ని ఏర్పాటుచేయించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ లైన్‌లతో పొంచిఉన్న ప్రమాదం

● తొలగించాలని దళిత కాలనీ ప్రజల విజ్ఞప్తి


ఇళ్లపైన చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

రాచర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుములవీడు దళిత కాలనీలో 11కేవీ విద్యుత్ లైన్ వలన ప్రమాదం పొంచి ఉందని విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే ఆ ప్రమాదాన్ని తప్పించాలని దళిత కాలనీ ప్రజలు శుక్రవారం విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దళిత గృహాలపై చేతికందే ఎత్తులో తీగలు ఉన్నాయని, గృహాల పైకి ఎక్కాలంటే భయమేస్తోందని వారన్నారు. గృహాలకు సంబంధించి ఏదైనా పని చేసుకోవాలంటే మిద్దెల పైకి ఎక్కాలంటేనే వణుకు పుడుతోందని వారు తెలిపారు. జిల్లాలోని మిగతా మండలాల్లో 11కేవీ విద్యుత్ లైన్‌లన్నింటిని తొలగించారని, ఒక్క రాచర్ల మండలంలోనే ఆ కార్యక్రమం చేపట్టలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బృహద్ వారాహి అలంకారంలో జగదాంబ



మార్కాపురం వన్‌టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో వారాహి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, వరుణ్ తేజ శర్మలు జగదాంబ మాత మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జగదాంబ మాత ఉత్సవమూర్తికి బృహద్ వారాహి అలంకారం నిర్వహించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.


మార్కాపురం మండలంలోని గజ్జలకొండ గ్రామ పరిధిలో దుక్కిదున్ని విత్తనం వేసేందుకు సిద్ధం చేసిన పొలం

వర్షం కోసం ఎదురుచూపు

● దుక్కిదున్ని భూమిని సిద్ధం చేసుకున్న రైతులు
● కంది, పత్తి, మొక్కజొన్న, బొప్పాయి సాగుకు మొగ్గు

మార్కాపురం రూరల్, జూన్ 27,(ఆంధ్రజ్యోతి) : దుక్కులు దున్ని విత్తనాలు సేకరించిన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది దాదాపు ఖరీఫ్ సీజన్ మొదలైంది. రైతన్నలు తమ భూములలో విత్తనాలు వేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌లతో భూములను దున్నుకుని విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. గత ఏడాది పంట సాగు చేసి నష్టం వాటిల్లినా ఈ ఏడాదైనా దిగుబడి రాకపోతుందా అనే ఆశతో విత్తనాలు వేసేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలోని బోడపాడుతో పాటు కొన్ని గ్రామాలలో ఈ పాటికే పత్తి తదితర విత్తనాలను వేసి సుమారు 15 రోజులు కావస్తుంది. వర్షం పడితే పంటకు బాగుంటుందని ఎదురు చూస్తున్నారు. మార్కాపురం మండలంలో ఈ సంవత్సరం మే నెలలో 19.4 సెంటీమీటర్లు, జూన్ నెలలో 7.5 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో కంది జూన్ నెల నాటికి 1,426 ఎకరాలలో, పత్తి 3,996 ఎకరాలలో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కూరగాయల పంటలను కూడా రైతులు అధిక సంఖ్యలో సాగుచేసే అవకాశం ఉంది.


ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
● 34 మందికి రూ. 35 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గిద్దలూరు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడే వారికి ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 34 మందికి 34,88,968 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అపన్న హస్తమని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పేద వారు నాణ్యమైన వైద్యం పొందవచ్చని, వైద్యానికి అయ్యే ఖర్చును ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పొందవచ్చన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి, బైలడుగు బాలయ్య, మోహన్‌రెడ్డి, తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాచర్లలో..

రాచర్ల : అనారోగ్యంతో బాధపడుతున్న మండలానికి చెందిన ఐదుమంది బాధితులకు రూ.2,54,148ల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు అందజేశారు.



తప్పిపోయిన వ్యక్తి రమేష్‌తో రాచర్ల పోలీసులు

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

రాచర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములపల్లి గ్రామంలో కర్రల కోసం కొండకు వెళ్లి అదృశ్యమైన యేలెం రమేష్ అనే వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. రమేష్ గత గురువారం ఉదయం సమీపంలో గల కొండ ప్రాంతంలోకి కర్రలకోసం వెళ్లి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై పి. కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి శుక్రవారం డ్రోన్ సహాయంతో అనుములపల్లి కొండ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వరకు కూడా అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులు వెను తిరిగి వచ్చి మళ్లీ సాయంత్రం గాలింపు చర్యలు చేపట్టగా తప్పిపోయిన రమేష్ రాచర్ల గ్రామ పరిసరాల్లో ఉన్నట్లు తెలుసుకున్నారు. దీంతో తమ సిబ్బందిని గ్రామంలోని మరికొందరిని రాచర్లకు పంపి గాలిస్తుండగా తప్పిపోయిన రమేష్ రాచర్ల గ్రామంలోని గుడి ప్రాంతంలో సంచరిస్తూ కనిపించాడు. వెంటనే అతనిని పోలీసులు అదుపులోకి తీసుకొని గ్రామ పెద్దల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. కేసును ట్రేస్ అవుట్ చేసిన ఎస్సైకి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు

రెండు మోటారు సైకిళ్లు ఢీ

● ఇరువురికి గాయాలు

పెద్ద దోర్నాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి):ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీ కొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పశువైద్యశాల వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన లాజర్, యడవల్లి గ్రామానికి చెందిన సింగా నానిలకు గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు కర్నూలు వైపు నుంచి దోర్నాలకు మోటారుసైకిలుపై లాజర్ వస్తుండగా దోర్నాల నుంచి యడవల్లికి నాని మోటారు సైకిలుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు వేగం అదుపు తప్పి ఢీ కొన్నాయి. దీంతో ఈ ప్రమాదం జరిగింది. గమనించిన కొందరు 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిత్యావసర వస్తువుల అందజేత

గిద్దలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదిఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సైనికులు నిత్యావసర వస్తువులను అందజేశారు. 5 నెలలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకులకు అందచేశారు. మాజీ సైనికుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కెప్టెన్ అంకన్న, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవి

ముండ్లమూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దొనకొండ ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని అన్నిశాఖల అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుఉంచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ పేద ప్రజలకు అందించటంలో తాను బాధ్యతగా పని చేస్తానన్నారు.

సుంకరవారిపాలెం ప్రజలకు తాగునీటి సౌకర్యం

ముండ్లమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం ప్రజల దాహార్తిని తీర్చేందుకు దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి ఎస్‌పీపీ నీరు సరఫరా చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన పైప్‌లైన్ పనులు ప్రారంభించి మాట్లాడారు. వేంపాడు నుంచి సుంకరవారిపాలెం వరకు ఎస్‌ఎపీ పైప్‌లైన్ నిర్మించేందుకు రూ 2.50 లక్షల నిధులతో పైపులైన్ వేసి ప్రజల దాహార్తి తీర్చటం జరుగుతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా తీర్చటం జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

తాళ్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.జాన్‌సన్ మండలంలోని శివరాంపురం, తాళ్లూరు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో వసతులు, దివ్యాంగులు ఓటుకు వెళ్లేందుకు ర్యాంప్‌లు ఏర్పాటు చేశారా, లేదా పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఆర్ఐ చంద్రశేఖరరావు, బూత్‌లెవల్ అధికారులు ఉన్నారు.

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు, పెదఉల్లగల్లు, పులిపాడు, ముండ్లమూరులోని పోలింగ్ కేంద్రాలను దర్శి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జాన్సన్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు గురించి తహసీల్దార్ లక్ష్మీనారాయణతో మాట్లాడారు.

సమ్మెను విజయవంతం చేయాలి

దర్శి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పది గంటల పనివిధానం పెంపు నిర్ణయం వ్యతిరేకంగా జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు సూచించారు. దర్శిలో శుక్రవారం జరిగిన సీఐటీయూ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ అంజయ్య, కె.అనీల్, యు.నారాయణ, ఏ.ఇస్మా యిల్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

పామూరు: జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.మాల్యాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం పామూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.పద్మకు అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అనిత, వాణి, పార్వతి, నారాయణమ్మ, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

ఒంగోలు(విద్య), జూన్27(ఆంధ్రజ్యోతి): బడి బయటి పిల్లలను స్కూళ్లలో చేర్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ను పెంచాలన్నారు. ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యా ర్థులకు 25శాతం అడ్మిషన్లు కల్పించటం గురించి ప్రచారం చేయాలని, ఎస్సీ, ఎస్టీ పిల్లలను చేర్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలు వురు అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఒంగోలు విచ్చేసిన రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణకు వినతిపత్రం అందజే సింది. కార్పొరేషన్‌లోని శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికు ల సమస్యలను యూనియన్ నాయకులు మంత్రికి వివరించారు. సమస్యలను సానుకూలంగా ఆలకించిన మంత్రి నారాయణ పరిష్కారం కోసం కృషి చేస్తా మని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే..

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన

దోమల నివారణ సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

కనిగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన అన్నారు. మలేరియా వ్యాధిపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక చర్చి సెంటరులో జరిగిన మానవహారంలో ఆమె మాట్లాడుతూ మలేరియా రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కీటక జనిత వ్యాధులు నియంత్రణకై కృషి చేద్దాం అంటూ ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

జిల్లా మలేరియా నివారణాధికారి ఎస్.మధుసూదన్ రావు మాట్లాడుతూ అంటువ్యాధులు, జ్వరాలపై ప్రజలు అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమకాటుకు గురైన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స చేయించుకోవాలన్నారు. ఇంటి బయట, పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ, చెట్లు పొదలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు, నీరునిల్వ ఉన్న తొట్టెలపై మూతలను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. ఇంటి ఆవరణల్లో బంతి, పుదీనా మొక్కలను పెంచితే వాటి ఘాటైన వాసనకు దోమలు ఇళ్లల్లోకి ప్రవేశించకుండా ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ దోమ తెరలు వాడాలని చెప్పారు. మలేరియా నివారణకు కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి వెంకటఫణి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు, గుడ్‌హెల్ప్ రమేష్, మున్సిపల్ శానిటరీ అధికారి నాయబ్‌రసూల్, ఎంఈవో సంజీవి, ఉపాధ్యాయులు పల్లారత్నం, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం

» ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

పామూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకుంటామని ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పామూరుకు చెందిన భూబాధితుడికి నష్టపరిహారం మంజూరు కోసం శుక్రవారం విచారణ చేపట్టారు. పామూరు పట్టణంలో 1995లో విరువూరు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణంలో 40 సెంట్ల వ్యవసాయ భూమి కోల్పోయామని, తగిన నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతూ షేక్ హాజీ గౌస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు గత నెలలో జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యటించి రికార్డులను పరిశీలించారు. నెల రోజుల్లో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈనేపథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు నష్టపరిహారంపై విచారణ చేపట్టేందుకు కనిగిరి ఆర్డీవో శుక్రవారం కార్యాలయానికి విచ్చేశారు. బాధితుడు షేక్ హాజీగౌస్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి నష్టపరిహారంపై చర్చించారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

సమావేశంలో తహసీల్దార్ ఆర్ .వాసుదేవరావు, మండల సర్వేయర్ స్నేహ, ఆర్అండ్‌బీ ఏఈ ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

» మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పిచ్చయ్య

దర్శి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నీ వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన చోట్ల నూతన పనులకు ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమ కట్టడాల నిర్మాణాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» ఎంపీడీవో హనుమంతరావు



ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

పీసీపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వస్తున్న ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్స్‌పై ఎంపీడీవో హనుమంతరావు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని గుదేవారిపాలెం, మారెళ్ల గ్రామాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని చెప్పారు. ఈ పథకాలు అందించేక్రమంలో అధికారులుగానీ, సిబ్బందిగానీ ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా, లంచాలు అడిగినా ప్రభుత్వం నుంచి ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలిసినప్పుడు స్పందించకపోయినా ఫిర్యాదుచేయాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించేందుకే ఈఫోన్‌కాల్స్ వస్తున్నాయని చెప్పారు. అనంతరం వీధులలో పర్యటించిన ఆయన ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని గ్రీన్ అంబాసిడర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి

» తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

దొనకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి అని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి కౌలురైతు సీసీఆర్‌సీ కార్డు పొందేలా రైతుసేవా కేంద్రాల పరిధిలో వీఆర్వోలు, వీఏఏలు చైతన్యపర్చాలన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీసీఆర్‌సీ కార్డుల జారీపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దొనకొండ మండలంలో 906 కార్డులు జారీ చేయాలనేది లక్ష్యమన్నారు. ఇందుకోసం గ్రామాల్లో వీఆర్వోలు, వీఏఏలు రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ మాట్లాడుతూ కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఉంటేనే ఈ పంట నమోదు, పంటల బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

మహిళా సర్పంచులు

» డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తదితరులు

కనిగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకో వాలని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సర్పంచులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఐదోరోజు శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ద్వారా మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించినట్టు చెప్పారు.

ప్రజల ద్వారా ఎన్నుకోబడిన మహిళా సర్పంచులు వారివారి గ్రామాల అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రతి గ్రామంలో సభలు నిర్వహిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మహిళా సర్పంచులు చురుకుగా వ్యవహరించాలన్నారు. తమ స్థానంలో సమావేశాలకు భర్తలను పంపే ప్రక్రియకు స్వస్తి చెప్పాలన్నారు. గ్రామాల్లోని మహిళలను చైతన్య పరుస్తూ వారి జీవనోపాధికి, అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. తద్వారా మహిళలకు గ్రామంలో సుస్థిర స్థానం ఏర్పడుతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, ఎంపీడీవో ప్రభాకర్‌శర్మ, డాక్టర్ పి.సుజాత, ఎల్ .ఏడుకొండలు, ఎం.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

పామూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి చిహ్నంగా హిందూ ముస్లింలు అనాదిగా జరుపుకొనే మొహర్రం వేడుకలను శనివారం నుంచి జూలై 7 వరకు నిర్వహిస్తున్నట్టు పీర్ల చావిడిల ముజావర్లు తెలిపారు. ఇస్లాం మత వ్యవస్థాపకుడు మహమ్మద్ ప్రవక్త మనుమళ్లు ఇమామేహసన్, ఇమామేహుసేన్, ఇమామే ఖాశీం వంశీయుల త్యాగనిరతికి ప్రతీకగా పదిరోజుల పాటు వేడుకలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం.

అమావాస్య ముగిసి పాడ్యమి అనంతరం నెలవంక దర్శనంతో మొహర్రం వేడుకలు ప్రారంభమవుతాయి. ఈసందర్భంగా పట్టణంలోని మూడు చావిడీలతో పాటు మండలంలోని గోపాలపురం, పడమట కట్టకిందపల్లి గ్రామాల్లో ఉన్న పీర్ల చావిడీలకు రంగులు వేయించి రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుతున్నారు.

ఎఫ్‌పీవోలతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రమేష్

దర్శి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతులు ఉమ్మడిగా ఏర్పడి ఆర్గనైజేషన్లు ఏర్పాటుచేసుకుంటే బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పీఏసీఎస్ సభ్యులకు ఎఫ్‌పీవోపై అవగాహన సదస్సు నిర్వహించారు.

రమేష్ మాట్లాడుతూ మార్కెట్లకు పంటల రవాణా చేసేందుకు సామూహిత సామర్థ్యాన్ని పెంపొందించు కునేందుకు ఎఫ్‌పీవోల ఏర్పాటు ఎంతో అవసరమవుతుంద న్నారు. కేంద్ర ప్రభుత్వం పదివేల రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)లను ఏర్పాటు చే యాలని నిర్దేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం సీహెచ్ ప్రదీప్ కుమార్‌రెడ్డి, భానుప్రకాష్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత నీరు

పామూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుతో సురక్షిత నీరు అందుబాటులోకి రావడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామంలో ఏర్పాటుచేసిన రిజ్వాన ఆర్వో ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత నీరు లేక ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి తరుణంలో గ్రామంలో రిజ్వాన ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ డి.కొండబాబు, సర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, కె.సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

పామూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకుల సంక్షేమం కోసం గొర్రెలు, మేకలకు ఉచితంగా అందజేస్తున్న నట్టల నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బొట్లగూడూరులో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రగొల్ల బాల, కోటపాటి రాజ, వెటర్నరీ అసిస్టెంట్ విజయదుర్గ, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నారపురెడ్డి మాల కొండారెడ్డి సహకారంతో శుక్రవారం విద్యార్థులకు ఎంఈవోలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి నోటు పుస్తకాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని దాతలు అందజేస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పులి రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, టి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు కె.చెన్నయ్య, ఎన్.గాంధీ, జి.రామకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగులు, యూనిఫాంలను పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధి గుంటిమడుగు కృష్ణంరాజు శుక్రవారం పంపిణీ చేశారు. హైస్కూల్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఎస్ఎంసీ చైర్మన్ ముద్దులూరి వెంకటనారాయణ అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లుల ఆదా

దొనకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు విద్యుత్ భారం తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అమల్లోకి తెచ్చిందని ఏఈ నాగూర్ తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, సోలార్ విద్యుత్ ప్రయోజనాలు వివరిస్తూ కొంతమంది వినియోగదారులనైనా సోలార్ విద్యుత్ వైపు మళ్లించాలనే లక్ష్యంతో గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ఈసందర్భంగా ఏఈ నాగూర్ మాట్లాడుతూ సోలార్ వాడకంతో విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని చెప్పారు. ఇంటి పైకప్పు చల్లగా ఉంటుందన్నారు. వాడకానికి మించి ఉత్పత్తి చేస్తే మిగులు విద్యు త్‌ను విద్యుత్ సంస్థలకు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చునని చెప్పారు. ఆసక్తి కలిగిన వినియోగదారులు స్థానిక విద్యుత్ సిబ్బందినిగాని, కార్యాలయంలోగాని సంప్రదించాలని ఆయన కోరారు.

జీతాలు అందక పారిశుధ్య కార్మికుల అవస్థలు

తాళ్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా జీతాలు చెల్లించక పోవటంతో కుటుంబపోషణ కష్టంగా ఉందని బొద్దికూరపాడు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు చీమలదిన్నె నారాయణ, కొప్పుల వెంకటయ్య, లక్ష్మీ నరసింహం, బంది యల్లమంద శుక్రవారం నిరసన తెలిపారు. జీతాలు చెల్లించాలని సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని అనేకమార్లు అడిగినా ఫలితం లేకపోయిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నెలాఖరులోగా చెల్లించి తమ కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని పులిపాడు ఎస్సీ కాలనీకి చెందిన దాసరి మరియబాబు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికివచ్చాడు. ఈక్రమంలో శుక్రవారం మృతిచెందాడు. మరియబాబు గత ఫిబ్రవరి 11న రిక్షాను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కోమాలోకి వెళ్ళటంతో డాక్టర్లు పరిస్థితి విషమించిందని చెప్పి వారం రోజుల క్రితం ఇంటికి పంపారు. శుక్రవారం మరియబాబు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

96 మందికి నూతన పింఛన్‌లు మంజూరు

ముండ్లమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో 96 మందికి కొత్తగా పింఛన్‌లు మంజూరైనట్టు ఎంపీడీవో ఎం.శ్రీదేవి తెలిపారు. కొత్త పింఛన్‌లను ఈనెల ఒకటో తేదీ లబ్ధిదారులకు అందజేయనున్నట్టు చెప్పారు. భర్త పింఛన్ పొందుతూ చనిపోతే భార్య దరఖాస్తు చేసుకున్న వెంటనే పింఛన్ అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 28 జూన్ 2025






కృత్రిమ మేధ నిపుణులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు, డీజీపీ



హైటెక్ అంటే..

హేళన చేశారు



నేడు ప్రపంచ వ్యాప్తంగా 30 శాతం మంది తెలుగువారు సాంకేతిక నిపుణులుగా పని చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఆదాయం అర్జించే సాంకేతిక నిపుణులుగా తెలుగువారు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.



ఆర్‌వీఆర్ జేసీ కాలేజీలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, తదితరులు



సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్త

- ఐటీ నిపుణుల్లో నేడు 30 శాతం తెలుగువారే
- యువత కోసం రాష్ట్రంలో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు
- ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్తే లక్ష్యం
- ఏఐ ఫర్ ఏపీ పోలీసు హ్యాకథాన్‌లో సీఎం చంద్రబాబు

గుంటూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'మూడు దశాబ్దాల క్రితమే ఐటీ గురించి ఆలోచించాను.. యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా హైటెక్ సిటీ నిర్మిస్తే.. ఆనాడు ఎంతోమంది హేళన చేశారు. అలాంటిది నేడు ప్రపంచ వ్యాప్తంగా 30 శాతం మంది తెలుగువారు సాంకేతిక నిపుణులుగా పని చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఆదాయం అర్జించే సాంకేతిక నిపుణులుగా తెలుగువారు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పోలీసు హ్యాకథాన్-2025ను మూడు రోజుల కార్యక్రమం శుక్రవారం గుంటూరు సమీపం చౌడవరంలోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి పోలీసు అధికారులు, ఐటీ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే క్వాంటం కంప్యూటింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉద్యోగాలు పోతాయనేది వాస్తవం కాదని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎక్కడి నుంచైనా పని చేసే సౌలభ్యం ప్రస్తుతం యువతకు ఉందన్నారు. దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని చంద్రబాబు చెప్పారు. ర్యాపిడో ద్వారా గుంటూరు జిల్లాకు చెందిన యువ పారిశ్రామికవేత్త రవాణా రంగంలో సృష్టిస్తున్న సంచలనం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ

(మిగతా 6వ పేజీలో)



జిందాల్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అక్టోబరుకి డంపింగ్ యార్డుల్లో ఎక్కడా చెత్త కుప్పలు కనిపించడానికి వీల్లేదని, వాటిని సుందరీకరించి ఆహ్లాదాన్ని అందించే పార్కుల్లా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడులోని జిందాల్ పవర్ ప్లాంట్‌ను శుక్రవారం సీఎం సందర్శించారు.



గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు

ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ జె.వెంకటమురళి



ఎస్టీ, దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎస్టీలు, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నాల్గో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఎస్టీలు, దివ్యాంగుల నుంచి కలెక్టర్ వినతిపత్రాలు స్వీకరించారు. ఆయా సమస్యలపై తక్షణమే న్యాయం చేస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. దివ్యాంగులు, ఎస్టీలు నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఉపకలెక్టర్ లవన్న, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపికైన వారికి నియామక పత్రాలు

మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత విభాగాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటమురళి నియామక పత్రాలను అందజేశారు. ఐసీపీఎస్‌లో అవుట్ రీచ్ వర్కర్‌గా సయ్యద్ అబ్దుల్ కరీం, ఎస్ఏఏలో ఆయాలుగా ఎం మేర్సీ, ఎం.శివకుమారి, సఖీ ఓఎస్‌సీలో పారా మెడికల్ పర్సన్‌గా పి.దీప్తి, కేస్ వర్కర్‌గా జె.జోత్స్న, మల్టీపర్పస్ స్టాఫ్‌గా జి.ఉమామహేశ్వరిలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

సీజ్‌తోనే.. సరి

- గ్రానైట్ అక్రమ రావాణాపై చర్యలు శూన్యం
- 17 లారీలు పట్టుకున్నా జరిమానా విధించని వైనం
- వాణిజ్య పన్నుల శాఖాధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాజకీయ అండతో గ్రానైట్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కుల మధ్య తలెత్తిన వివాదాలతో లారీ నెంబర్ల సహా వాణిజ్యపన్నుల శాఖకు సమాచారం అందుతుండగా అధికారులు దాడులు చేస్తున్నారు. ఈ విధంగా ఇటీవల పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 17 గ్రానైట్ లారీలను సీజ్ చేశారు. అయితే అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారన్న విమర్శలున్నాయి. లారీలు సీజ్ చేసి మూడు రోజులు గడిచినా సంబంధితులకు నోటీసులు జారీ చేసి మిన్నకున్నారే కానీ వారిపై జరిమానాలు విధించలేదు. ఒక్కొక్క లారీలో సుమారు 3.50 లక్షల గ్రానైట్ ఉందని అధికారులు నిర్ధారించారు. 18 శాతం పన్ను చెల్లించి వే బిల్లు ద్వారా గ్రానైట్ రవాణా చేయాల్సి ఉండగా బోగస్ బిల్లులు సృష్టించి రవాణా చేస్తున్న అంశం అధికారుల తనిఖీల్లో తేలింది. సీజ్ చేసిన లారీల్లో ఉన్న గ్రానైట్‌కు రూ.9,18,000 పన్ను చెలించాలి. అయితే అధికారం అండతో దర్జాగా జిల్లా సరిహద్దులు దాటించేందుకు అక్రమార్కులు ప్రయత్నించారని అర్థమవుతోంది. జరిమానా లేకుండా 18 శాతం పన్ను చెల్లిస్తామని అధికార పార్టీ నేతలతో అధికారులపై అక్రమార్కులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తుందా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వాణిజ్య పన్నుల శాఖ మిన్నకుంటుందో చూడాలి.

ఉపాధికి ఊరట



- 30 శాతం బకాయిలు చెల్లింపుకు ఏర్పాట్లు
- 2014-18 లోపు బకాయిలు కూడా..
- బిల్లులు అప్‌లోడ్ చేసిన డ్వామా

గురువారం.. గురువారం బిల్లుల చెల్లిస్తామన్నారు. తొలుత రెండు గురువారాలు బిల్లులు చెల్లించ డంతో ఎగబడి మరీ కాంట్రాక్టర్లు 'ఉపాధి' పనులు చేశారు. అప్పటి నుంచి 34 గురువారాలు గడిచినా బిల్లుల చెల్లించకపోవడంతో పనులు చేసిన వారు, పాడి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయితే ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో.. బకాయిదారుల్లో కొందరికి ఊరట లభించనుంది. మొత్తం బకాయిల్లో 30 నుంచి 35 శాతం బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు డ్వామా బకాయిల బిల్లులను సిద్ధం చేసింది. రానున్న పది రోజుల్లో బకాయిల సొమ్ము పనులు చేసిన వారికి అందే అవకాశం ఉంది.

ఎన్‌ఆర్ఈజీఎస్ పనుల బిల్లులకు మోక్షం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.154.46 కోట్ల బిల్లులు చెల్లించాలి. తొలి విడతలో రూ.46.40 కోట్లు చెల్లించనున్నారు. 2014 నుంచి 2018 వరకు ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు కూడా 30 నుంచి 40 శాతం చెల్లించనున్నారు.



గోకులం షెడ్

జిల్లా వారీగా చెల్లింపు ఇలా..

ఉపాధి పథకం కింద సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, నీటి తొట్లు వంటి పనులను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. ఈ పనులు పూర్తి చేసి 9 నెలలు గడిచిపోయింది. పల్నాడు జిల్లాలో రూ.80.49 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉండగా రూ.24.24 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లకు రూ.17.43 కోట్లు, గుంటూరు జిల్లాలో

(మిగతా 6వ పేజీలో)



బదిలీలు.. ప్రహసనం

- సచివాలయ సిబ్బందిలో అయోమయం
- మార్గదర్శకాలపై స్పష్టత కరువుతో గందరగోళం
- హేతుబద్ధీకరణతో పాటు బదిలీలతో గజి బిజీ
- మిగులు సిబ్బందిపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- త్రిశంకు స్వర్గంలో మహిళా పోలీసుల పరిస్థితి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డుల సచివాలయాల్లో సిబ్బంది బదిలీల ప్రక్రియ ఓ ప్రహ సనంగా మారింది. గత ప్రభుత్వం ఏర్పా టు చేసిన ఈ సచివాలయ వ్యవస్థను క్రమబద్ధీకరిస్తామని తొలుత కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రక్రియ సాగుతుండగా బదిలీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గందరగోళం.. అయోమ యం.. గజిబిజీలా మారింది. ఉద్యోగుల హేతుబద్ధీకరణ చేసి సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఈ ప్రభుత్వం తలచి గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ జరుగుతుండగానే సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇవ్వడంతో పాటు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. దీంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిలో దాదాపు 35 శాతం మంది బదిలీలకు అర్హులుగా తేలారు. బదిలీ దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 24, కౌన్సెలింగ్ 29 వరకు చేపట్టి మొత్తం ప్రక్రియను జూలై 10లోగా ముగించేలా ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. ఈ ప్రక్రియపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో ఉన్న చిక్కులపై దృష్టి పెట్టకుండానే పాలకులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే, ఇవేవీ తమకు పట్టవన్నట్లు తాము చెప్పిన వారికి చెప్పిన చోట పోస్టింగ్ ఇవ్వాలనే నేతల సిఫార్సులతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

మిగులు సిబ్బంది సంగతేంటి?

తాజాగా ప్రభుత్వం చేపట్టిన సచివాలయ సిబ్బంది రేషనలైజేషన్‌లో భాగంగా బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో (మిగతా 6వ పేజీలో)

చినుకు పడితే.. కరెంట్ కట్

- కొద్దిపాటి గాలివీచినా అంధకారమే
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు



పర్చూరు అంబేద్కర్ నగర్‌లో ఇనుప స్తంభానికి సపోర్టుగా మరో కాలం చెల్లిన ఇనుప స్తంభం

పర్చూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓ మోస్తరు వర్షం పడినా.. గాలివీచినా.. పిడుగు పడినా కరెంట్ పోతోంది. తరచూ విద్యుత్ సర ఫరాకు అంతరాయంతో పర్చూరు సబ్‌డివిజన్ వాసులు అంధకారంలో అల్లాడుతున్నారు. వర్షం వస్తుందంటే ఎక్కడ కరెంట్ పోతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ, మరమ్మతుల వైఫల్యం కారణంగా విద్యుత్ అంతరాయాలు కలుగుతున్నా అధికా రుల్లో చలనం లేదు. పర్చూరు సబ్‌డివిజన్‌కు రెగ్యులర్ ఏఈ నియామకం గురించే అధికారు లు పట్టించుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకో వచ్చు. కరెంటు వైర్లను చెట్లు అల్లుకున్నా, స్తం భాలు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సరఫరాలో సమస్య తలెత్తినా పూర్తిస్థాయి మరమ్మతులు కష్టతరంగా మారింది. పర్చూరు అంబేద్కర్‌నగర్‌లో విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ యువకుడు తుప్పుపట్టిన విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తూ షాక్‌కు గురై ఇటీవల మృతి చెందాడు. ప్రమా దానికి కారణమైన తుప్పుపట్టిన స్తంభాన్ని నేటికి తొలగించలేదంటే ఆ శాఖ పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చాలాప్రాంతాల్లో కరెంటు తీగలు కిందకు వేలాడుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేయటంతో పాటు, తీగలు మారుస్తామని అనేక మార్లు విద్యుత్ శాఖ అధికారుల చెప్పినా నేటికీ అమలుకు నోచుకోలేదు. ఎక్కడ చూసినా అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలు దర్శనమిస్తున్నాయి. దీంతో గాలి వీచినా, విని యోగం పెరిగినా తీగలు తెగడం, సరఫరాకు అంతరాయం సర్వసాధారణంగా మారింది. పైగా అసలు సమస్య ఎక్కడ ఉందో గుర్తించ డానికి విద్యుత్ సిబ్బందికి తలనొప్పిగా మారింది.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

రూ.17 వేల జరిమానా



నిందితులతో సంతమాగులూరు పోలీస్ సిబ్బంది

అద్దంకి, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ఆరుగురికి ఏడేళ్ల జైలుశిక్ష రూ.17 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి శుక్రవారం తీర్పుచెప్పారు. సంతమాగులూరు ఎస్సై మేదరమెట్ల పట్టాభిరామయ్య కథనం మేరకు.., సంతమాగులూరు మండలం కుందుర్తికి చెందిన బొమ్మినేని కృష్ణయ్య, నిందితులకు పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2020 నవంబరు 11వ తేదీ సాయంత్రం బెండకాయలను కొమ్మాలపాడులో కాటా వేసి బాబాయి వీరాస్వామితో కలిసి బొమ్మినేని కృష్ణయ్య తిరిగి వస్తున్నారు. ఎస్ఎస్‌పీ కాలువ సమీపంలో అదే గ్రామానికి చెందిన జడ వెంకటేశ్వర్లు, జడ వీరాంజనేయులు, జడ వెంకట్రావు, జడ శ్రీనివాసరావు, జడ గోపి లతో పాటు వినుకొండ మండలం నాగులవరానికి చెందిన కొణికి యోగయ్యలు దారి కాచి కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో కృష్ణయ్య, వీరాస్వామిల తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. అప్పట్లో ఎస్సైగా ఉన్న శివన్నారాయణ కేసు నమోదు చేశారు. అద్దంకి కోర్టులో కేసు విచారణకు రావడంతో సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్సై పట్టాభిరామయ్యల పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుళ్లు వెంకటేష్, కృష్ణలు సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చేప్పే విధంగా తర్ఫీదు నిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.వీరనారాయణ కోర్టు లో వాదనలు వినిపించారు. కేసు విచారించిన న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి శుక్రవారం ఆరుగురు దోషులకు 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.17 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అప్పుడే బాధితులకు న్యాయం : ఎస్పీ

నేరం చేసిన వ్యక్తులకు కోర్టులో శిక్ష పడినప్పుడే బాధితుడికి న్యాయం చేసినట్లు అవుతుందని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. నేరస్థులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను ఎస్పీ తుషార్‌డూడి ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల దాడులు

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం(చీరాల), మే 27 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. కొంత కాలంగా మండలానికి చెందిన కొందరు వ్యక్తులు రాత్రింబవళ్లు ఇసుక రవాణా సాగిస్తున్నారు. అయితే రవాణాలో ఎవ్వరికి చెందాల్సిన ముడుపులు వారికి చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఏక కాలంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అధికారులు ఐదు ట్రాక్టర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే కొందరిపై కేసులు కూడా నమోదైనట్లు సమాచారం. అయితే దాడులు పారదర్శకంగా ఉంటాయా..? లేక తాత్కాలికమేనా...? అని వేచి చూడాల్సి ఉంది. అలాగే ఇప్పటి వరకు జరిగిన అక్రమ రవాణాపై అధికారులు అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

స్కూళ్ల పనివేళల్లో సమావేశాలు వద్దు

● పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

ఒంగోలు(విద్య), జూన్27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఎటువంటి సమావేశాలు నిర్వహించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాల ప్రారంభ సమయం ఉదయం 9నుంచి ముగింపు సమయం సాయంత్రం 4గంటల వరకు సమావేశాలు జరపకూడదని, ఈ మేరకు ఆర్జేడీలు, డీఈవోలు, ఉప విద్యాధికారులు, ఎంఈవోలను ఆదేశిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. స్కూళ్లలో తరగతులు నిర్వహించే సమయంలో సమావేశాలు నిర్వహిస్తే బోధనకు ఆటంకం కలుగుతుందని, విద్యార్థుల విద్యాభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. స్కూళ్ల పని వేళల అనంతరం మాత్రమే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డైరెక్టర్ హెచ్చరించారు.

దేవాలయాలకు వెళ్లాలంటే భయం భయం

శిథిలావస్థకు చేరుతున్న కొణిదెన ప్రసిద్ధ గుళ్లు

ముక్తేశ్వరంలో పురాతన కాలంనాటివి జీర్ణావస్థకు

పడిపోతున్న గోడలు

ప్రతిపాదనల తయారీలో జాప్యం చేస్తున్న అధికారులు

చోళరాజుల కాలం నాటి దేవాలయాలు

కనుమరుగయ్యే ప్రమాదం

పట్టించుకొని దేవదాయ, పురావస్తుశాఖలు


మాన్యాలున్నా అభివృద్ధి లేదని భక్తులు ఆందోళన



శిథిలావస్థకు చేరిన కొణిదెన వేణుగోపాల స్వామి దేవాలయం

బల్లికురవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రసిద్ధ పురాతన దేవాలయాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతున్నాయి. సామాన్యశకం 11వ శతాబ్ధపు నాటి పురాతన దేవాలయాలకు నేడు ఆలనా పాలనా కరువైంది. కొంతకాలానికి ఆనవాళ్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని భక్తులు వాపోతున్నారు. ఎంతో విలువైన భూములు ఉన్న దేవాలయాల గురించి మాత్రం దేవాదాయశాఖ, పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం అంటే గుర్తుకు వచ్చేది చోళరాజులు పరిపాలించిన కొణిదెన గ్రామం ఇక్కడ అప్పట్లో రాజులు 101 బావి కోటిఒక్క శాసనాలను ఇక్కడ ప్రతిష్ఠించారు. అప్పట్లోనే గ్రామంలో రాజులు వేణుగోపాలస్వామి, చెన్నకేశవస్వామి దేవాలయాలను నిర్మించారు. వందల సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన రెండు దేవాలయాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. అలానే ఈ గ్రామంలో ఎన్నో శాసనాలు కూడా ఉన్నాయి. పలు మార్లు పురవస్తుశాఖ అధికారులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించి ప్రసిద్ధ దేవాల యాలను అభివృద్ధి చేస్తామని గ్రామస్థులకు చెప్పారు. అయినప్పటికి ఇంతవరకు ఈ దేవాలయాల అభివృద్ధి గురించి పట్టించుకో లేదు. దీంతో దేవాలయాల గోడలు పడిపోతున్నాయి. దేవాలయంలో ప్రశాంతంగా కుర్చోని పూజలు చేయాల్సిన భక్తులు భయాందోళన చెందుతున్నారు. దేవాదాయశాఖ, పురావస్తు శాఖ అధికార్లు ఒకరిపై ఒకరు అభివృద్ధి పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం పడిపోయిన చెన్నకేశవస్వామి దేవాలయ గోడ నిర్మాణానికి ఇంతవరకు ప్రతిపాదనలు కూడా పంపలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామ ప్రజలు ఇదే గ్రామంలో చోళరాజుల కాలంనాటి బ్రహ్మగుండాన్ని విరాళాలతో అభివృద్ధి చేపట్టారు. దేవాలయాలను నిర్మాణం చేయాలంటే నిధులు పెద్దఎత్తున కావాలని ప్రభుత్వం వెంటనే స్పందించి పురాతన దేవాలయాలను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో వందల సంవత్సరాల నుంచి కొండపై భాగంలో ఉన్న ముక్తిలింగేశ్వర స్వామి దేవాలయం జీర్ణావస్థకు చేరింది. ఈ దేవాలయానికి వెళ్లే మెట్లమార్గం కూడా చెట్లతో అల్లుకొని ఉందని ఈ దేవాలయం అభివృద్ధి పరిచి పురాతన దేవాలయాలను కాపాడాలని భక్తులు కోరుతున్నారు. దేవాలయాలకు గతంలో వందల ఎకరాల భూములు ఉన్నాయని ఇప్పుడు ఆ భూములు కొన్ని ఆక్రమణలో ఉన్నాయని తక్షణమే ప్రభుత్వం రికార్డులలో ఉన్న ప్రకారం ఆ భూములను వెలికితీసి దేవాలయాలను అభివృద్ధి పరచాలని భక్తులు కోరుతున్నారు.



రెండేళ్ల క్రితం పడిపోయిన చెన్నకేశవస్వామి దేవాలయం గోడలు

మద్యం లావాదేవీలు కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ

● ఈఎస్ ఆయేషాబేగం

ఒంగోలు క్రైం, జూన్27(ఆంధ్రజ్యోతి): మద్యం లావాదేవీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ పర్యవేక్షణ చేస్తున్నారని ఈఎస్ ఆయేషా బేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందుకోసం మద్యం దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 188 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పటికి 122 దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో మిగిలిన అన్ని దుకాణాల వద్ద ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ సీసీ కెమెరాలను అన్ని హెడ్‌క్వార్టర్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేస్తున్నామని, దీంతో ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా పర్యవేక్షించే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మద్యం విక్రయాలలో సమయపాలన కోసం పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. కానిస్టేబుల్‌కు రూట్‌లు ఏర్పాటు చేసి ఒక్కో కానిస్టేబుల్ 2 నుంచి 5 మద్యం దుకాణాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వారు మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసివేయించి ఐ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా మద్యం దుకాణాల వద్ద విధివిధానాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే 14005 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఇక బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు, మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని, ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఈఎస్ హెచ్చరించారు.

ఉపాధికి ఊరట.!

(5వ పేజీ తరువాయి)

రూ.15.79 కోట్లకు రూ.4.73 కోట్లు బిల్లులు చెల్లించనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా బిల్లులను అప్‌లోడ్ చేశారు. ఈ పనులతో పాటు పాడి రైతులు నిర్మించుకున్న గోకులాలకు కూడా బిల్లులు చెల్లించలేదు. గోకులాల షెడ్‌లకు సబంధించి పల్నాడు జిల్లాలో రూ. 6.03 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.6.23 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.1.26 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు జరగుతున్నాయి.

2018కు ముందు బకాయిలు కూడా..

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2014 నుంచి 2018 లోపు ఉపాధి పథకం కింద చేసిన పనులకు సంబంధించి బిల్లుల బకాయిలు చెలించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో సదరు బిల్లులను విత్‌హెల్డ్‌లో ఉంచారు. ఈ బిల్లులను తిరిగి ఆమోదించారు. మూడు జిల్లాల్లో రూ.70 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఏడేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సదరు పనులు నిర్వహించిన వారికి ఊరట లభించనుంది. బిల్లుల అప్‌లోడ్ చేశామని రానున్న వారంలో బిల్లుల చెల్లింపులు జరిగే అవకాశం ఉందని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు.

బదిలీలు.. ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

దాదాపు 2,200 వరకు మిగులు సిబ్బంది ఉన్నట్లు లెక్కతేల్చారు. వీరిని నూతన మార్గదర్శకాల ప్రకారం కొత్తగా కొలువుదీరే సచివాలయాలతో పాటు జనాభా ప్రామాణికంగా సర్దుబాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. మిగులు సిబ్బందిలో అధిక శాతం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉండగా బాపట్ల జిల్లాలో వీరి సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. బదిలీల్లో భాగంగా వీరిని ఎలా సర్దుబాటు చేయాలనే దానిపై ప్రభుత్వానికే స్పష్టత లేకపోవడం గమనార్హం. నూతన జిల్లాలో సచివాలయ సిబ్బంది వివిధ శాఖల్లో డిప్యుటేషన్‌పై రెండేళ్ల నుంచి పనిచేస్తున్నారు. వీరి విషయంలోనూ గందరగోళమే. ఇలాంటి వారి సంఖ్య మూడు జిల్లాల పరిధిలో దాదాపు 450 వరకు ఉన్నట్లు సమాచారం. బాపట్ల, పల్నాడు జిల్లాల్లోనే దాదాపు కనీసం 900 మంది వరకు సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ పరిస్థితుల్లో సచివాలయాల్లో మిగులు ఉన్న సిబ్బందిని ఆయా ఖాళీల్లో భర్తీ చేసే విధంగా ప్రణాళికలు రచించింది. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటైన విజన్ కమిటీల్లో కూడా సచివాలయ సిబ్బందినే ఐదుగురిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఇన్ని బాలారిష్టాల మధ్యనే బదిలీల తంతు జరుగుతుండడం విస్మయపరిచేదిలా ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేం ఏ విభాగం కిందకి వస్తాం..

సచివాలయ మహిళా పోలీసుల పరిస్థితి అయితే ఘోరంగా ఉంది. మూడు జిల్లాల పరిధిలో ఉన్న దాదాపు 1,700 మంది మహిళా పోలీసులను ఐసీడీఎస్ గొడుకు కిందకు తేవాలనే ప్రతిపాదనను ఇటీవల ప్రభుత్వం తెచ్చింది. తర్వాత దానిని అటకెక్కించింది. పోలీసు విభాగం కిందనే ఉంచాలనేది ఇంకో నిర్ణయం. ఇదీ ఆచరణ దాల్చలేదు. ఇప్పుడు బదిలీల్లో వీరికి ఇచ్చే ఆప్షన్లు మొదలుకుని విభాగం వరకు అంతటా గందరగోళమే.

పల్లెసిగలో ప్రగతిసిరి!

● నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి స్వామి



గార్లపేటలో రూ.50లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు

మద్రిపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పల్లెసీమల్లో ప్రగతి పనులు జోరందుకున్నాయి. ముఖ్యంగా ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో వేసిన సిమెంట్‌రోడ్లు పల్లెలకు సరికొత్తశోభను సంత రించుకుంటున్నాయి. 3.25 కిలోమీటర్ల ద్వారా రూ.2.8కోట్లతో సిమెంట్‌రోడ్డు నిర్మాణాలు ఇ ప్పటికే పూర్తి అయ్యాయి. మండలంలోని అ య్యపురాజుపాలెంలో 40, రామాయపాలెంలో 30, రావెళ్ళవారిపాలెం 30, తంగెళ్ల 30, ధర్మ వరం 30, మద్రిపూడిలో 50, గుండ్లసముద్రం లో 20, కెల్లంపల్లి 20, గార్లపేట రూ.50 లక్షల తో రహదారి నిర్మాణ పనులు పూర్తి అయ్యా యి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి ఊసే కనిపించలేదు. అంతర్గత రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో వాటి పరిస్థితి అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే రహదారులు చిత్తడిగా మారి గ్రామీ ణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యం లో రాష్ట్ర మంత్రి స్వామి గ్రామీణ రహదారు లపై దృష్టికి సారించారు. ఉపాధిహామీ పథ కం ద్వారా నిధులు మంజూరు కావడంతో పృ దులగిరిపై 200 మీటర్ల సిమెంట్‌రోడ్డు నిర్మా ణం పూర్తి చేశారు. దీంతో లక్ష్మీనర సింహస్వామి దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. రహదా రి 30 మీటర్ల వెడల్పుతో సువిశాలంగా ఏర్పా టు చేయడంతో వాహనాల పార్కింగ్ సమస్య తీరింది. అంతే కాకుండా గోశాల సమీపంలో కల్వర్టు నిర్మించడంతో వరదనీరు సెలయేరు ద్వారా కొండ కిందకు చేరుకుంటుంది. మరో రూ.30 లక్షలతో పృదులగిరిపైన సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి మంత్రిస్వామి ప్రతిపాదనలు సి ద్ధం చేయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.8.50కోట్లతో మద్రిపూడి నుంచి పొదిలి మండలం జాప్లాపురం యానాదికాలనీ వరకు 10.5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణ పనులు మంజూరయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ రహదారి పనులను ఆగమేఘాలపై ప్రారం భించారు. అయితే అటవీ అనుమతులు రాక పోవడంతో రహదారి నిర్మాణ పనులకు అవరో ధం ఏర్పడింది. బిల్లులు చెల్లింపులు జరగకపో వడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడం పై జాప్యం వహించారు. ఈ నేపథ్యంలో కూ టమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో స్థానిక శాసనసభ్యులు స్వామి రాష్ట్ర మంత్రివర్గంలో చోటుదక్కించుకోవడంతో అటవి అనుమతుల ను ఇప్పించడంలో ఆయన సఫలీకృతులయ్యా రు. తారురోడ్డు నిర్మాణ పనులు నూతన ప్ర భుత్వ హయాంలో పూర్తి అయ్యాయి. గార్లపే టలో ఎన్నోఏళ్ళుగా ఎస్సీకాలనీ వాసులు సరైన రహదారిలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా రు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పక్కారోడ్డు నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. రూ.50లక్షలతో 600 మీటర్లకుపైగా సిమెంట్‌రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. అ ధ్వానంగా ఉన్న కూచిపూడి గార్లపేట ఆర్ అండ్‌బీ రహదారి అభివృద్ధికి రూ.1.08 కోట్లు నిధులు మంజూరు చేయించారు. మొత్తంమీ ద మండలంలో పలురహదారుల అభివృద్ధి వేగంగా జరుగుతండటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పృధుల గిరి అభివృద్ధి పనులకు మంత్రిస్వామి ప్రారం భోత్సవం చేయనున్నారు.



రూ.8.50కోట్లతో పూర్తయిన పృథులగిరి తారురోడ్డు,

హైటెక్ అంటే.. హేళన చేశారు

(5వ పేజీ తరువాయి)

అని చెప్పారు. రాష్ట్రంలో గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, కర్నూలు తదితర ప్రాంతాల్లో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణను యువతకు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో క్వాంటం కంప్యూటర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు విస్తృతం కానున్నట్లు చెప్పారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ నేర పరిశోధనలో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడమే లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

సాంకేతికతకు ఆద్యుడు చంద్రబాబు

హైటెక్ సిటీని నిర్మించి ప్రపంచ వ్యాప్తంగా ఐటీ నిపుణులు తయారు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తు తం వాట్సాప్ గవర్నెన్స్‌తో పాటు నాడు మీసేవ, ప్రభుత్వ కార్యాలయా ల్లో డిజిటలైజే షన్, బయోమెట్రిక్ ప్రక్రియలకు శ్రీకారం చుట్టింది చంద్రబాబేనన్నారు. క్వాంటం కంప్యూటర్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం ఆలోచిస్తున్నారని చెప్పారు. సమస్యకు పరిష్కారం చూపటమే లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పనిచేస్తుందని దీనిని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముందంజలో ఏపీ పోలీస్ : డీజీపీ

జాతీయస్థాయిలో మొట్టమొదటి సారి ఏఐ ద్వారా రానున్న రోజుల్లో చట్టాన్ని అమలును చేసేలా హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్లు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా చెప్పారు. రాష్ట్ర పోలీస్ విభాగం మొదటి నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో దేశంలో ముందు ఉందన్నారు. గతంలో ఏపీ పోలీస్ రూపొందించిన ఈ-కాప్ ప్లాట్‌ఫామ్ సీసీటీఎన్ఎస్‌గా మారీ జాతీయస్థాయిలో ప్రామాణికంగా ఉందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం కృత్రిమ మేధను ప్రధాన పాత్రగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మూడు నెలలు క్రితమే పుట్టిన హ్యాకథాన్ ఆలోచనను 30 మంది సీనియర్ ఐపీఎస్‌లు, 4సైట్ ఏఐ నాలెడ్జ్ భాగస్వామితో కలసి నిర్వహిస్తున్నామన్నారు. సిలికాన్ వ్యాలీ, గ్లోబల్ ఏఐ కమ్యూనిటీ బృందాలు ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఐపీఎస్ ఆఫీసర్ దీపికాపాటిల్, ఐజీ ఆపరేషన్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్, ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాల యువతి సత్తా

జాతీయస్థాయిలో మూడోస్థానంలో నిలిచిన లక్ష్మి



పతకాలతో లక్ష్మీ

చీరాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం దేవాంగిరిలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున బాపట్ల జిల్లా చీరాల పరిధిలోని పేరాలకు చెందిన ఎస్ లక్ష్మీ పాల్గొన్నారు. సత్తా చాటి మూడవ స్థానంలో నిలిచింది. జూనియర్ బాలికల విభాగంలో పాల్గొన్న శ్రీలక్ష్మీ 69 కేజీల విభాగం, బెంచ్ ప్రాజ్ 77 కిలోలు, డీడ్ ఫిట్ విభాగంలో పోటీల్లో పాల్గొన్నారు. మొత్తంగా మూడు విభాగాల్లో పాల్గొని 410 కేజీల బరువులు ఎత్తడంతో ఆమె మూడవ స్థానం దక్కించుకున్నారు. అందుకు సంబంధించి పతకాన్ని గురువారం కర్ణాటకలో అందుకుంది. దీంతో జిల్లా పరిధిలోని పలువురు ప్రముఖులు ఆమెను అభినందిస్తున్నారు.

పంటలకు బీమా చేసుకోవాలి

గిద్దలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకునే పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని, తద్వారా నష్టపోయిన సందర్భంలో పరిహారం పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. ఎకరాకు సంబంధించి వరిపంటకు రూ. 860, కంది పంటకు రూ. 430, సజ్జకు రూ.156, మినుములకు రూ. 205, నువ్వులకు రూ.180, పత్తికి రూ.2100, ఎండుమిరపకు ఎకరాకు రూ.4,500 ప్రీమియం చెల్లించి పంటల బీమా పొందవచ్చని పేర్కొన్నారు. వరి మినహా మిగతా పంటలకు జూలై 31వ తేదీలోగా, వరికి ఆగస్టు 15వ తేదీలోగా బీమా చేసుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబరు తీసుకుని మీ సేవా లేదా సీఎస్‌సీ సెంటర్లకు వెళ్లి పంటల బీమా చేసుకోవచ్చని తెలిపారు.

నీరు నిలబడకుండా చూడాలి



రోడ్డు మధ్యలో మురుగును పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్ల మధ్యలో మురుగు, వర్షపు నీరు నిలబడకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని రాజానగర్‌లో రోడ్డు మధ్యలో మురికినీరు, వర్షం నీరు నిలబడి ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిమెంటు రోడ్లపై కూడా నీరు నిలబడితే ఎలా అని ప్రశ్నించారు. పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువల్లోకి నీరు పోయే విధంగా చిన్నపాటి కాలువలను ఏర్పాటు చేయాలని సూచించారు. మాయాబజారులో కూడా ఆయన వీధులను పరిశీలించారు. పలు వీధుల్లో డ్రైనేజీలను ఆక్రమించుకుని మెట్లు, అరుగులు, ఇతర నిర్మాణాలు ఉండడాన్ని గమనించి వాటిని వెంటనే తొలగించుకోవాలని యజమానులకు సూచించారు. కాలువలపై నిర్మాణాలు చేపడితే వర్షం నీరు కాలువల్లోకి ఎలా పోతుందని ప్రశ్నించారు. ఆయన వెంట సచివాలయ, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

స్కూల్ వాహనాల్లో భద్రతా చర్యలు పాటించాలి



స్కూల్స్ యాజమానులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్స్ వాహనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేటు స్కూల్స్ యజమానులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి వాహనంలో విధిగా ఎంవీఐ ధ్రువీకరించిన పత్రాలు ఉండాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు తప్పక వాహనంలో ఉండాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లు జరిగితే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, సీహెచ్ అహరోన్, పలు ప్రైవేటు స్కూళ్ల యజమానులు పాల్గొన్నారు.

కందకాల నాణ్యత పరిశీలన



కందకాలను పరిశీలిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి

కంభం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జలశక్తి అభయలో భాగంగా తురిమెళ్ళ గ్రామంలో 2022-23 సంవత్సరంలో చేసిన చెలియకొండ-2లో కందకాల పని తీరును సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. చేసిన పని ఉపయోగంగా ఉన్నదీ, లేనిదీ ఆయన తెలుసుకున్నారు. కొండకు కందకాలు తీయడం వలన కొండ కింద పొలాలకు కోత పడకుండా, భూగర్భజలాలు పెరుగుతాయని రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీడీ భాస్కర్‌రావు, ఒంగోలు డీఆర్‌పీ ఇజ్రాయిల్, ఉపాధి హామీ కంభం ఏపీవో జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

'మార్కాపురం' అభివృద్ధికి నిధులివ్వాలి

ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే కందుల



లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం రాత్రి సీఎంకు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా పట్టణం నుంచి రైల్వేస్టేషన్ వరకు చెరువుకట్టపై రహదారిని అభివృద్ధి పరచాలని కోరారు. అంతేకాక మార్కాపురం నుంచి తర్లుపాడుకు డబుల్ రోడ్డు, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇందిరమ్మ కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. త్రిపురాంతకం మండలం దూపాడు నుంచి కుడి కాలువ ద్వారా పట్టణానికి తాగునీటి అవసరాలు తీర్చే పైప్‌లైన్ అభివృద్ధి పనులకు కూడా తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చారు.

అవీ..ఇవీ..

నిరుద్యోగ యువతకు ఉచితంగా డేటా ఇంజనీర్ కోర్సు

చినగంజాం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉచిత డేటా ఇంజనీర్ కోర్సు అందిస్తున్నట్లు సంస్థ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత డేటా ఇంజనీర్ కోర్సుకు 2022-2025 విద్యా సంవత్సరంలో బీఎస్సీ, ఎంఎస్‌సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ పూర్తి చేసిన పట్టభద్రులు మాత్రమే అర్హులు అని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్ అండ్ అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో జరుగుతాయన్నారు. కోర్సు పూర్తి అయిన తర్వాత ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత పూర్తి వివరాలకు 9052372023, 9849251213 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏడీఏగా ఎఫ్రాయిం బాధ్యతలు


ఎఫ్రాయంను అభినందిస్తున్న ఏడీఏ

అద్దంకిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ ఎఫ్రాయం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో ఏడీఏగా పనిచేస్తున్న ఆయన బదిలీపై అద్దంకి ఏడీఏగా వచ్చారు. అద్దంకిలో పనిచేస్తున్న కె.ధన్‌రాజ్ బాపట్ల ఏడీఏగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎఫ్రాయింకు అద్దంకి, కొరిశపాడు మండలాల వ్యవసాయశాఖ అధికారులు కొర్రపాటి వెంకటకృష్ణ, ఎస్.రామమోహన్‌రెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు, ల్యాబ్ ఏఈవోలు రిబకా, హరిత, జూనియర్ అసిస్టెంట్ సాంబశివరావు, కాలేష వలి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మోటారు వైర్ల చోరీ

బల్లికురవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామ పరిధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ మోటార్ వైర్లను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం రైతులు పంట పొలాలకు వెళ్లి మోటార్లు ఆన్ చేయగా వైర్లు కట్ చేసి ఉండటం చూసిన రైతులు కేబుల్ వైర్లు లేవని గుర్తించి లబోదిబో మన్నారు. సుమారు పది మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు చోరీ అయినట్లు రైతులు తెలిపారు. చోరీ అయిన వైర్ల విలువ రూ.20 వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,జూన్27(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్తగా విద్యుత్ టవర్ లైన్ ల నిర్మాణం పనులు జరుగుతున్నందున శనివారం సంజీవనగర్, వియన్‌యస్ థియేటర్, ఆర్టీసీ బస్టాండ్, రామాటాకీస్ రోడ్డు, పాత బస్టాండ్‌సెంటర్, ఎస్‌బిఐ బ్యాంక్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, కన్యకాపరమేశ్వరి దేవాలయం,అత్తులూరివారి బజార్,బంగ్లా రోడ్డు, సత్యనారాయణ కళామందిర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

రైతులను ఆదుకునేందుకే బర్లీ కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎం.కొండయ్య

చీరాల/పర్చూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కంపెనీలు కొనుగోలు చేయక, సరైన ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నల్లబర్లీ రైతాంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేశంలో ఎక్కడా లేనివిధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడానికి శ్రీకారం చుట్టిందని, ఇది చారిత్రాత్మక అంశమని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎంకొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం వారు చీరాల, పర్చూరు పొగాకు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు మండెలను పరిశీలించారు. రైతులతో కొంతసేపు ముచ్చటించి కొనుగోలు విషయంలో ఏమైన సమస్యలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. పొగాకు కొనుగోళ్ల పాదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఏలూరి వెల్లడించారు. చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తుందనిరైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేద న్నారు. ప్రభుత్వ సూచనలను తప్పక అనుసరించాలని ఏలూరి కోరారు. ప్రతి రైతు తప్పనిసరిగా సీఎం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తేమశాతం 19 కన్నా మించకూడదన్నారు. కొనుగోళ్ల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు.


ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న కారంచేడు వైస్ ఎంపీపీ

పొగాకు రైతులను ఆదుకుంటాం

పొగాకు రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా ప్రభుత్వం కృషి చేస్తోందని అధైర్య పడవద్దని చీరాల, ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. అలాగే కొనుగోలుకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రైతుల కోసం అవసరమైతే మరోకేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొంత ఆలస్యమైనా ప్రభుత్వం కచ్చి తంగా రైతులను ఆదుకునేందుకు స్పష్టమైన ప్రణాళికలు చేస్తున్నట్లు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పొగాకు రైతులు పాల్గొన్నారు.

పర్చూరు / కారంచేడు : బర్లీ పొగాకు కొనుగోలుపై కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ఆసక్తికర కామెంట్స్ చేశారు. బర్లీ పొగాకు రైతుల పాలిట దేవుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అని కొనియాడారు. ప్రభుత్వం నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయడం చారిత్రాత్మకమన్నారు. చీరాలలో పొగాకు విక్రయించేందుకు వచ్చిన వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని అనుకోలేదన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొంటాం రైతులు తొందరపడి తక్కువ ధరకు అమ్ముకొని మోసపోవద్దని ఏలూరి చెప్పారన్నారు. బర్లీ పొగాకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించడం హర్షించతగ్గ విషయం అన్నారు. ఏలూరికి ప్రభుత్వానికి చేతులెత్తి నమస్కరించాలని ఒకింత భావో ద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 90 శాతం రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.


పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, కొండయ్యలు

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాలు

బల్లికురవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల అధికారి విజయజ్యోతికుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు, కొప్పెరపాడు, వైదన, చవిటి మాదిగపల్లె, ముక్తేశ్వరం, సూరేపల్లి, బల్లికురవ, గుంటుపల్లి, కూకట్లపల్లి రామాంజనేయపురం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 12 వందలపైన ఉన్న ఓటర్లు ఉంటే రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. అలానే పోలింగ్ కేంద్రాలు మరమ్మతులకు గురి అయి ఉంటే నివేదిక తయారు చేసి ఉన్నతాధికార్లకు పంపుతామన్నారు. అలానే రెండు కిలోమీటర్ల దూరం ఉంటే నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్ని కేంద్రాలపై నివేదికను తయారు చేసి పంపుతామన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రవినాయక్, ఆర్ఐ పోతురాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జ్యోతికుమారి

కలెక్టర్‌ను కలిసిన యానాది కాలనీ వాసులు

వేటపాలెం(చీరాల), మే 27 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ యానాది కాలనీ వాసులు శుక్రవారం కలెక్టర్ వెంకటమురళీని కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జీవన విధానాలకు అడ్డంకులు తొలగించాలని చెప్పుకున్నారు. పక్కా గృహాలు లేక, నివేశన స్థలాలు లేక నానా యాతన పడుతున్నట్లు వివరించారు. అంతే కాకుండా గ్రామం పరిధిలోని నీటికుంటల్లో చేపల వేట చేసుకునేందుకు ఆటంకాలు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ జీవన విధానంలో సమస్యలు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. అలాగే నివేశన స్థలాలు, గృహాల మంజూరు ప్రక్రియను పరిశీలన చేసి పరిష్కరిస్తామని చెప్పారు.


కలెక్టర్‌ను కలిసిన వేటపాలెం యానాదులు

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ


కంప్యూటర్ అందచేస్తున్న వీరనారాయణ

పంగులూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ కంప్యూటర్‌తో పాటు ఆరు కుర్చీలు బహూకరించారు. కొండమూరులోని ప్రాథమికోన్నత పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన ఉన్నత పాఠశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ శుక్రవారం కంప్యూటర్‌తో పాటు కుర్చీలను హెచ్‌ఎం వాసు బాబుకు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికి కొళాయిల ఏర్పాటే ప్రభుత్వ ధ్యేయం


చక్రాయపాలెంలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న గ్రామస్థులు

అద్దంకి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గోవాడలో జలజీవన్‌మిషన్ పనులను డీఈ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. చక్రాయపాలెం, కుంకుపాడులలో స్థానిక నేతలు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఏఈ రామాంజనేయులు, కుంకుపాడు సర్పంచ్ గాలం శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పుట్టా సాంబశివరావు, నరిశెట్టి వీరరాఘవులు, తమ్మిశెట్టి స్వాములు, రాయుడు నరేంద్రబాబు, గోగులమూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఇంకొల్లు, జూన్ 27, (ఆంధ్రజ్యోతి) మండలంలోని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. పరిమి రామ కృష్ణ, కె.శ్రీలక్ష్మీ, బి.భాస్కర రావు, ఎం.సురేష్‌బాబు, టి.రత్నకుమారి బదిలీ కాగా శుక్రవారం పాఠశాలలో దుద్దుకూరు గ్రామవికాస్ తరఫున ప్రవాసాంధ్రుడు రాయిణి సుబ్బరామయ్య, చెన్నుపాటి జనార్ధనరావు, పాఠశాల సిబ్బంది ఘనంగా శాలువాతో సత్కరించారు. వారిస్థానంలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భాస్కరరావు, శ్రీనివాసాచార్యులు, యు.చెంచయ్య, శంకరరావు, బాలసుబ్రమణ్యం, చినబాబు, వెంకట్రావు, విజయకుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నేడు మండల పూజ

అద్దంకి, జూన్27(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మహా కుంభాభిషేకం నిర్వహించి శనివారానికి 41 రోజులు పూర్తవుతున్నందున మండల పూజ నిర్వహిస్తున్నట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. దాతలు హాజరుకావాలన్నారు.

పీర్ల చావిడి భవనాన్ని అభివృద్ధి పరిచిన దాతలు


అభివృద్ధి చేసిన పీర్లచావిడి

బల్లికురవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో ముస్లీంలకు చెందిన పీర్ల చావిడి భవనాన్ని అదే గ్రామానికి చెందిన దాతలు అదామ్ సాహెబ్ కుమారులు షేక్ సైదా, సుభానిలు రూ. 16 లక్షలతో అభివృద్ధి పరిచారు. కొంతకాలంగా మరమ్మతు లతో ఉన్న పీర్ల చావిడి భవనాన్ని దాతలు తమ సొంత నిధులతో అభివృద్ధి పరిచి శుక్రవారం ప్రారంభించారు. వచ్చే నెల 6న మొహర్రం పండగ పర్వదినం రోజున ఆధునికీకరణ చేసిన పీర్ల చావిడి నుంచి జెండాల ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ముస్లిం పెద్దలు తెలిపారు. పీర్ల చావిడిని అభివృద్ధికి సహకరించిన దాతలను ముస్లీం కాలనీ వాసులు అభినందించారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి: ఎంపీడీవో


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎనర్జీ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూర్యఘర్ పథకం ఆవశ్యకత, లక్ష్యసాధనపై సూచనలిచ్చారు. ఆగష్టు 15వ తేదీ నాటికి మండలంలో 1500 సూర్యఘర్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా ఎనర్జీ అసిస్టెంట్లు, ఎస్.హెచ్.గ్రూపు సభ్యులు, కార్య దర్శులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుమంత్, కార్యదర్శులు, ఎనర్జీ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

మాచవరం పాఠశాల తనిఖీ

నాగులుప్పలపాడు, జూన్27 (ఆంధ్రజ్యోతి): మాచవరం జడ్పీ హైస్కూలు పాఠశాలను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర రా ష్ట్ర పరిశీలకుడు పి. రమేష్ శుక్రవారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఈ ఏడాది అందించిన విద్యా కిట్లు సక్రమంగా అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు.

ఎస్సైగా జీవీ.చౌదరి బాధ్యతలు స్వీకరణ



పర్చూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా జీవీ.చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై పర్చూరు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన మాల్యాద్రిని బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజలకు సేవలు పారదర్శకంగా చేరాలి

- ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య


ట్యాబ్‌లు అందుకున్న ఆర్పీలతో ఎమ్మెల్యే కొండయ్య, మెప్మా ప్రతినిధులు

చీరాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రతివీధిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా చేరాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మెప్మా విభాగంలోని 56 మంది ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అలాగే మరో 15 మందికి డీజీలక్ష్మీ కార్యక్రమంలో భాగంగా బయోమెట్రిక్ మిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతిఇంటికి చేరాలంటే అందుకు అనుగుణంగా వారి సమాచారం విధిగా ఆయాశాఖకు చేరడంతో పాటు, లబ్ధిపొందే అంశాలపై అవగాహన ఉండాలన్నారు. అలాగే సిబ్బంది కూడా ప్రజల పట్ల పారదర్శకంగా ఉండాలన్నారు. ఈక్రమంలోనే ఆర్పీలకు ట్యాబ్‌లు, డీజీ లక్ష్మీలకు మిషన్‌లు అందించినట్లు తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ మాదిరిగా డీజీలక్ష్మీలు సేవలు అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, మెప్మా మేనేజర్ చినకొండయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

చీరాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : టీబీ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేసి ఆరోగ్యవతమైన సమాజాన్ని స్థాపించాలని వైద్యాధికారి డా.శిరీష, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ అన్నారు. టీబీ ముక్తిభారత్ అభియాన్ 100 రోజులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మరియమ్మపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంలో దీర్ఘకాలికంగా ఆరోగ్య సమస్యలున్నవారు, కుటుంబ సభ్యులు కచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే ముందు నుండే ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బేబమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

80 మందితో రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ

నెల్లూరు (సాంస్కృతికం) : వచ్చే నెల 6న మొదలయ్యే బారాషహీద్ దర్గా రొట్టెల పండుగలో భక్తులకు సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 80 మందితో జంబో కమిటీ వేసింది. ఆ మేరకు ఉత్తర్వులు జిల్లా కేంద్రానికి వచ్చాయి. కమిటీ ఛైర్మన్‌గా 32వ డివిజన్‌కు చెందిన ఖాదర్‌బాషా నియమితులవగా, ఉపాధ్యక్షులుగా సయ్యద్ రబ్బానీ, షేక్.కమలుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్‌నసూద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్.ఉమర్‌ఫరూక్, సయ్యద్ అజాద్ జమీర్, షేక్.రఫీ, సయ్యద్‌ఖాదర్, కార్యదర్శులుగా ఖలీల్ అహ్మద్ గులామ్, హుసేన్‌మాలిక్, షేక్.దావూద్, షేక్.దస్తగిరిలతోపాటు మరో 68 మంది కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

జులై 5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒకే వేదికపైకి చేర్చనుంది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. పిల్లల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం, జాతీయ విద్యావిధానం, విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం, తల్లిదండ్రుల పాత్ర తదితర అంశాలపై జులై 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 2.0)ను నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

- వివరాలు 8లో..

అన్నదాత సుఖీభవ జేఎల్‌పీఎంకు ప్రత్యేక డ్రైవ్ : జేసీ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అవసరమయ్యే జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (జాయింట్ ఎల్‌పీఎం) పూర్తిచేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. రెండవ విడత ఎంపికైన గ్రామాల్లో రీసర్వే సక్రమంగా పూర్తి చేయాలని, ఇప్పటి వరకు పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. రీసర్వేలో 22-ఏ, పీజీఆర్‌ఎస్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సంబంధిత చట్టపరమైన విషయాల నిర్వహణను క్రమబద్ధీకరించడానికి రూపొందించిన ఓఆర్‌సీఎంఎస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారన్నారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

ఆశించిన స్థాయిలో సాగని ఫ్లైవోవర్ల నిర్మాణ పనులు

బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద అవస్థలు

డిసెంబరు నాటికి పూర్తి : ఎన్‌హెచ్‌ఏఐ పీడీ

నెల్లూరు నగర పరిధిలో జాతీయ రహదారిపై చేపట్టిన ఫ్లైవర్ల నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతున్నాయి. మొన్నటిదాకా ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని అనుకుంటే ఈ వంతెనల నిర్మాణం మొదలయ్యాక రెట్టింపయ్యింది. పోనీ ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని వేగంగా నిర్మాణాలు చేస్తున్నారా? అంటే అదీనూ లేదు. మొదట భూసేకరణ సమస్యతో కొన్నాళ్లు పనులు ప్రారంభం కాలేదు. తర్వాత కాంట్రాక్టర్ ఆలస్యం చేయడంతో మరికొన్నాళ్లు పనులకు మోక్షం లభించలేదు. ఆ తర్వాత ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వెంట పడడంతో ఎలాగోలా పనులు మొదలయ్యాయి. అయితే ఇప్పుడు ఈ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్డు జంక్షన్ల వద్ద రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య విపరీతమవుతోంది.

- వివరాలు 8లో..





కనుల పండువగా పాండవ జనన అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం హోమం, విశేష పూజలు, చప్పర ఉత్సవం, భగవద్గీత పారాయణ జరిగాయి. సాయంత్రం విశేష పూజలు, మూలవర్లకు పూలంగిసేవ జరిగాయి. అనంతరం పాండవ జనన అలంకారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మహాభారతం ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వక్ఫ్ ఆస్తులకు భద్రత ఏదీ!?

జిల్లాలో వందల ఎకరాలు అన్యాక్రాంతం

ముస్లింల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన ఆస్తులవి. నిరుపేద ముస్లిం పిల్లల ఉజ్వల భవితకు అండగా నిలవాల్సిన భూ ములు. మసీదులు, దర్గాల ఆలనా పాలనా చూసుకునేందుకు దాతలు ఇచ్చిన విలువైన సంపద. కాలం కరిగే కొద్దీ ఆ ఆస్తులంతా అన్యాక్రాంతమైపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరి మూలంగా వందల ఎకరాల వక్ఫ్ ఆస్తులు మాయమైపోతున్నాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే సుమారు వెయ్యి ఎకరాల వరకూ ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని దశాబ్దాల నుంచి వక్ఫ్ ఆస్తులను గుర్తిస్తూనే ఉన్నారు తప్ప వాటి ని రక్షించుకోవడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఈ క్రమంలో తొలిసారి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సమావేశం శనివారం నెల్లూరులో జరగనుంది. జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులపై చర్చించనున్నారు.

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వక్ఫ్ భూములుండగా, కొన్ని భూములు మసీదులకు, దర్గాలకు అనుబంధంగా ఉన్నాయి. వందల ఏళ్ల నుంచి దాతలు ఇచ్చిన ఆస్తులుగా ఇవి రికార్డుల్లో నమోదై ఉన్నాయి. గతంలో సర్వే నిర్వహించిన అధికారులు జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల వరకూ వక్ఫ్‌బోర్డు భూములున్నట్లు గుర్తించారు. అందులో దాదాపు మూడొంతులకుపైగా ఇతరుల ఆధీనంలో ఉన్నట్లు తేల్చారు. వక్ఫ్ స్వాధీనంలో కేవలం 208 ఎకరాలు మాత్రమే ఉంది. ప్రభుత్వ అవసరాలకు 31 ఎకరాలను వినియోగించుకోగా, మరో 112 ఎకరాలకు సంబంధించిన వివాదం వివిధ కోర్టుల్లో నడుస్తోంది. ఒక్క నెల్లూరులోని పొగతోట, మాగుంట లేఅవుట్, సరస్వతీ నగర్, ఫత్తేఖాన్‌పేటతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో 150 ఎకరాలు వక్ఫ్ ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 90 శాతం వరకూ భూముల్లో ఐదారు దశాబ్దాల నుంచి నివాసాలు ఉన్నాయి. కొంతమేర మాత్రమే ప్రస్తుతం వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉంది. జిల్లావ్యాప్తంగా ఆక్రమణకు గురైన భూముల విలువ రూ.కోట్లలో ఉంటుంది.

● నేడు సమావేశం..

అన్యాక్రాంతమైనట్లు అధికారుల దృష్టికి వచ్చాక ఆ భూముల్లో బోర్డులు పెట్టడమో లేదా ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడమో చేసి సరిపెడుతున్నారు తప్ప వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఈ ఆక్రమణలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించుకోవడం సాధ్యపడదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాకు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. సాధారణంగా బోర్డు సమావేశాలన్నీ రాష్ట్ర కార్యాలయంలోనే జరుగుతుంటాయి. కానీ తొలిసారి ఈ సమావేశాలను జిల్లాల్లో నిర్వహించాలని అజీజ్ నిర్ణయించారు. అందులో భాగంగా తొలిసారిగా నెల్లూరులో బోర్డు సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. అజీజ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సభ్యులైన ఎమ్మెల్సీ రూహుల్లా, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ప్రకాశం కలెక్టర్ తమీమ్ అన్సారియాతోపాటు ఇతర సభ్యులు పాల్గొననున్నారు. నెల్లూరు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగే సమావేశం అనంతరం వారంతా బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం నెల్లూరు నగరంలోని పలు వక్ఫ్‌బోర్డు ఆస్తులను సందర్శిస్తారు.

ఆక్రమణకు గురైన వక్ఫ్ ఆస్తులు

ప్రాంతం	ఎకరాలు
ఉదయగిరి	340
నెల్లూరు	150
కావలి	140
వరికుంటపాడు	96
చేజర్ల	96
వింజమూరు	95
సూళ్లూరుపేట	94
జలదంకి	92
ఏఎస్‌పేట	91
కోవూరు	78
కలువాయి	74
అల్లూరు	69
సీతారామపురం	64
రాపూరు	58
బుచ్చి	53
ఆత్మకూరు	45
అనంతసాగరం	32
చిల్లకూరు	27
కలిగిరి	24
టీపీ గూడూరు	22
మర్రిపాడు	19
కోట	18
పొదలకూరు	13
వెంకటాచలం	13
కొండాపురం	11
సంగం	11
దగదర్తి	9
వాకాడు	9
కొడవలూరు	7
సైదాపురం	4
విడవలూరు	2

పాఠశాలల ఉన్నతికి నిధులు విడుదల

- 46 పీఎంశ్రీ పాఠశాలల్లో 6 అంశాల్లో పనులు
- 470 ప్రైమరీ మోడల్ స్కూళ్లలో అదనపు గదులు
- రూ.2.5 కోట్లతో 10 కేజీబీవీల్లో పలు అభివృద్ధి పనులు
- పాఠశాలల నిర్వహణకూ నిధులు విడుదల
- సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య

నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం ఉన్నతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు పీఎంశ్రీ పాఠశాలలకు, పాఠశాలల నిర్వహణకు, ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిందని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖలోని ఎస్‌ఎస్‌ఏ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలు 46 ఉండగా, వీటిలో ఆరు అంశాలకు సంబంధించి జరుగుతున్న పనులకు నిధులు విడుదలైనట్లు చెప్పారు. 11 పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.15.58 లక్షల అంచనాలతో పనులు ప్రారంభించగా రూ.13.24 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. అలాగే 36 పాఠశాలల్లో క్రీడామైదానాల అభివృద్ధికి ఒక్కోదానికి రూ.5లక్షల అంచనాలతో పనులు ప్రారంభించగా రూ.4.25 లక్షలు విడుదల చేశారన్నారు. వీటితోపాటు 20 పాఠశాలల్లో ర్యాంప్స్ అండ్ రైల్స్ ఏర్పాటుకు ఒక్కొక్క దానికి రూ.1.06 లక్షలు విడుదల చేశారన్నారు. 3 పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు ఒక్కోదానికి రూ.23.10 లక్షలు అవసరం కాగా రూ.19.64 లక్షలు విడుదల చేశారన్నారు. 33 పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్స్‌కు ఒక్కొక్కదానికి రూ.1.5 లక్షలు అవసరం కాగా రూ.1.27 లక్షలు విడుదల చేశారన్నా రు. వీటితోపాటు 27 పాఠశాలల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు ఒక్కో దానికి రూ. లక్ష అవసరం కాగా తొలి విడతగా రూ.85వేలు చొప్పున విడుదలయ్యాయన్నారు. ఈ నిధులతో పనులను వేగవంతం చేసి ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో అదనపు గదులు

జిల్లాలోని 470 ప్రైమరీ మోడల్ స్కూల్స్‌లో అవసరమైన చోట అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీసీ తెలిపారు. మొత్తం 1270 గదులు అవసరమని గుర్తించామని, అన్నింటినీ తాత్కాలిక పద్ధతుల్లో నిర్మాణాలు చేపట్టి ముందు వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అనంతరం శాశ్వత నిర్మాణాలు చేపడతారని తెలిపారు. అలాగే జిల్లాలోని 10 కేజీబీవీల్లో రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 2,571 పాఠశాలల నిర్వహణకు రూ.5,77,80,000 అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, తొలివిడతగా రూ.2,88,90,000 (50 శాతం) నిధులు విడుదల చేశారన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని, జులై 12వతేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా సీఆర్‌పీ, అంగన్‌వాడీ, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు నిత్యం గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. జిల్లాలో 14,232 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు గుర్తించామని, వీరందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

భక్తుల కొంగుబంగారం కలిగిరమ్మ

రేపటి నుంచి తిరుణాళ్ల ● 3 గ్రామాల్లో గ్రామోత్సవాలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

- 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్

8లో..

అహా.. మాకేంటి!?

- కార్గో పార్శిళ్ల స్వీకరణలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల తీరిది
- నగదు ఇవ్వకుంటే అంతే!
- ఫిర్యాదు చేస్తే 'కార్గో' సిబ్బంది వింత సమాధానాలు
- కొరవడిన ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

నగరంలో ఉంటున్న గోపి తన సొంతూరికి పార్శిల్ పెట్టేందుకు ఉదయాన్నే ఆర్టీసీలోని కార్గో వద్దకు వచ్చాడు. పార్శిల్‌ను తూకం వేసిన సిబ్బంది రూ.100 అవుతుందని చెప్పడంతో అంతా చెల్లించాడు. అయితే, ఆ ఊరికి వెళ్లే బస్సులో మీరే పార్శిల్ వేసుకోవాలని సూచించడంతో మధ్యాహ్నం వరకు బస్టాండులోనే వేచి ఉండాల్సి వచ్చింది. తీరా బస్సు రావడంతో పార్శిల్‌ను డ్రైవర్‌కు ఇచ్చాడు. తనకేంటని అడగడంతో చేసేదిలేక రూ.100 సమర్పించుకున్నాడు.

ఓ వ్యాపారి తన వద్ద ఉన్న వస్తువులను విజయవాడకు పంపాల్సి వచ్చింది. దీంతో పార్శిల్ చేసి, కార్గో వద్దకు వెళ్లాడు. బరువు అంతా చూసి నగదు చెల్లించాడు. అయితే, పార్శిల్ మాత్రం వ్యాపారినే వేసుకోమని అక్కడున్న సిబ్బంది చెప్పాడు. దీంతో బస్సు వద్దకు వెళ్లగా రూ.200 ఇస్తేనే పార్శిల్ తీసుకుంటామని చెప్పడంతో చేసేదిలేక అంత ఇచ్చుకోవాల్సి వచ్చింది.



ఏపీఎస్ ఆర్టీసీ కార్గో విభాగంలో జరుగుతన్న తీరిది. సహజంగా కార్గోలో వస్తువులు, కవర్లు బుక్ చేసుకున్న సమయంలో ఉద్యోగులు పార్శిళ్లను ఆయా డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో వేయాలి. అయితే ఇందుకు భిన్నంగా కార్గో సిబ్బంది పార్శిల్ బుక్ చేసిన వెంటనే 'మీకు అర్జెంటా అయితే నేరుగా బస్సు వద్దకు వెళ్లి పార్శిల్స్ ఇచ్చుకోండి.' అని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో తాము పార్శిళ్లను ఆ బస్సుల్లో ఇవ్వలేము. మీరే ఇచ్చుకోవాలి.' అని చెబుతున్నారు. దీంతో పార్శిల్స్ బుక్ చేసుకున్న వారికి తిప్పలు తప్పడం లేదు.

● తప్పని వ్యయప్రయాసలు

ఆర్టీసీ కార్గోలో వస్తువులు బుక్ చేసుకునే ప్రజలు ఆ వస్తువు, కవర్ పార్శిల్ ఆధారంగా వాటి బరువు, ప్రాంతాన్ని బట్టి కిలోమీటర్ల ఆధారంగా రుసుము చెల్లించాలి. ఈ క్రమంలో కార్గోలో వస్తువును బుక్ చేసుకున్న వారు అక్కడే ఆ వస్తువులను ఇచ్చి వెళ్ళిపోతారు. అయితే కొన్ని ప్రాంతాలకు కార్గోలో వస్తువులు బుక్ చేసిన సిబ్బంది 'చిన్న కవర్లు కాబట్టి మీరే బస్సులో ఇచ్చుకోండి.' అంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. ఆ బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. మరోవైపు పార్శిల్ తీసుకోవాలంటే తమకేంటి అని డ్రైవరు, కండక్టర్లు ఎదురు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఎంతోకొంత వారికి సమర్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ అడిగినంత ఇవ్వకపోతే పార్శిల్‌ను బస్సుల్లో పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. కార్గోలో నగదు చెల్లించిన రశీదు ఉందని చెప్పినా ససేమీరా అంటున్నారు.

● మా మాట వినరు సర్!

కార్గోలో నగదు చెల్లించి ప్రజలు పార్శిల్స్ పంపేందుకు సిద్ధమవుతుంటే ఆర్టీసీలోని కొంతమంది డ్రైవర్లు, కండక్టర్ల తీరు విమర్శలకు తావిస్తోంది. చేయి తడిపితే తప్ప వారు పార్శిలు తీసుకోవడం లేదు. 'మీకు ఎందుకు ఇవ్వాలి. అక్కడ కార్గోకు నగదు ఇచ్చాం కదా!' అని ప్రశ్నిస్తుంటే అయితే వారితోనే మాట్లాడుకోండి. మేము తీసుకువెళ్లం' అంటూ కరాఖండీగా చేప్పేస్తున్నారు. దీంతో ప్రజలు నేరుగా కార్గో పాయింట్ వద్దకు వెళ్లి సిబ్బందికి ఫిర్యాదు చేస్తే వారి నుంచి కూడా సరియైన సమాధానం రావడం లేదు. 'ఏం చేద్దాం సర్.. వారు మా మాట వినరు. తక్కువ బరువున్న వస్తువులను వారు తీసుకు వెళ్లాలంటే డబ్బు ఇచ్చుకోవాలి.' అంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తే వారికి నగదు ఇవ్వాల్సిందే మాకు ఒక్క పార్శిల్‌కు వచ్చేది రూ.5 మాత్రమే వారు అంత తక్కువ నగదుకు తీసుకు వెళ్లరని సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్శిల్ రవాణాలో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎంలకు ఫిర్యాదు చేయచ్చు

ఆర్టీసీ కార్గోకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే సంబంధిత డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేయండి. కార్గోలో వస్తువులు బుక్ చేసుకున్న తర్వాత ఎవరికీ నగదు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా అడిగితే నేరుగా డీఎంలకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాము.

- షమీమ్, డిప్యూటీ సీటీఎం

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



ఆర్టీసీ ప్రధాన బస్టాండు ఆవరణలో కార్గో పాయింట్

సమగ్ర శిక్షలో బదిలీలకు దరఖాస్తులు

నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయింది. సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో, నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించిన తరువాత శనివారం తుది జాబితాను ప్రకటిస్తామని ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. జిల్లాలో సీఆర్‌ఎంటీలు 9, ఐఈఆర్‌పీలు 4, కేజీబీవీ సిబ్బంది 5, మండలస్థాయి అకౌంటెంట్‌లు 2, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు 4, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌లు 4, ఫిజికల్ అండ్ హెల్త్ విభాగంలో 5, వర్క్ ఎడ్యుకేషన్‌లో ఐదుగురు, అంతర్‌జిల్లాకు ముగ్గురు కలిపి మొత్తం 41 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరందరికీ ఈ నెల 30 నుంచి జులై 2వతేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి స్టేషన్ పాయింట్ల వారీగా నిబంధనలను అనుసరించి బదిలీలు చేపడతామన్నారు. 5న ఎస్‌పీడీకి నివేదించి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అందచేస్తామని తెలిపారు.

కందుకూరులో ఆక్రమిత స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :పామూరు రోడ్డులోని ప్రశాంతి కాలనీ సమీపంలో సర్వే నెంబరు 122/1 లో కబ్జాదారులు చదును చేసిన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. రూ. కోట్లు విలువ చేసే 1.75 ఎకరాల స్థలంపై కబ్జాదారుల కన్నేసిన వైనంపై 'ఖాళీ జాగా.. వేసేస్తాం పాగా' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో వీఆర్‌వో ఉదయ భాస్కర్, సర్వేయర్ ఆ స్థలాన్ని పరిశీలించారు. రికార్డుల్లో అది ప్రభుత్వ భూమిగా ఉండటమే కాగా గతంలో మున్సిపాలిటీ నిధులతో లెవెలింగ్ చేసి అభివృద్ధి చేసి ఉన్నట్లు గుర్తించామని వారు తెలిపారు. అయితే కొందరు తమకు పట్టాలు ఉన్నాయని చెబుతున్నారని, దీనిపై తహసీల్దారుకు నివేదిస్తామని తదుపరి చర్యలు తీసుకోవడం జరగుతుందని తెలిపారు.



మొహర్రం నెల ప్రారంభం

ముస్లింల పవిత్ర ప్రార్థనలు

రొట్టెల పండుగకు జెండా ప్రతిష్ఠ

దర్గాలో భక్తుల సందడి

- వివరాలు 8లో..

1న వితంతు పింఛన్ల మంజూరు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు కొత్తగా మంజూరైన 3,680 వితంతు పెన్షన్లను జులై 1వ తేదీన పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్లు 74,994 ఉండగా, పాత, కొత్త మొత్తం 77,674 వితంతు పెన్షన్లను మంగళవారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 575

పగలే వెన్నెల

లింగసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో పట్టపగలే వెన్నెలను తలపించేలా వీధిలైట్లు వెలుగుతొన్నాయి. చాలా కాలం నుంచి ఈ విధంగా వీధిలైట్లు వెలుగుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వీధిలైట్లను రాత్రి వేళ ఆన్ చేసేందుకు, ఉదయం ఆఫ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఫ్యూజు బాక్స్‌ను ఆపరేట్ చేసే సిబ్బంది లేక పోవడంతో లైట్లు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతోన్నాయి. దీంతో విద్యుత్ ఖర్చు పెరుగుతోంది. పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.





చుండి మోడల్‌స్కూల్లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు

రుచికరమైన భోజనం

● ఆపై పౌష్టికాహారం పంపిణీ ● స్కూళ్లలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం

వలేటివారిపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించిన ప్రభుత్వం మెనూలో మార్పులు తెచ్చింది. ప్రస్తుతం ఈ ఏడాది ప్రారంభం నుంచే విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించి పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేసింది. వలే టివారిపాలెం మండలంలో 41 ఎంపీపీ స్కూళ్లు, 4 ఎంపీయూ పీ స్కూళ్లు, 4 హైస్కూళ్లు, ఒక మోడల్‌స్కూల్, ఒక కేజీబీవీ స్కూల్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2,511 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఆ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజ నం అందిస్తున్నారు. 80 శాతం మందికిపైగా విద్యార్థులు ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్నారని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ఎక్కువమంది తింటున్నారు..



రాష్ట్ర కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలలో మధ్యాహ్న భోజనం సన్నబియ్యంతో వండుతున్నారు ఈ భోజనాన్ని ఎక్కువ మంది పిల్లలు తింటు న్నారు. సన్న బియ్యంతో వండడం వల్ల చాలా రుచిగా ఉంది. తినడానికి విద్యార్థులు ఇష్టపడుతున్నారు.

- సంధ, 10వ తరగతి

రోజూ పాఠశాల వద్దే తింటున్నా..



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం అంద జేసి ఎంతో మేలు చేసింది. సన్న బియ్యంతో తయారు చేసిన భోజనం ఎంతో రుచికరంగా ఉంది. దీంతో రోజూ పాఠశాల వద్దే మధ్యాహ్న బోజనం తింటున్నా.

- అంకమ్మ, ఇంటర్ విద్యార్థిని

ప్రారంభం రోజు నుంచే మార్పు



బడి ప్రారంభం రోజు నుంచే మధ్యాహ్న భోజనంలో మార్పు తెచ్చారు. గతంలో బియ్యం లావుగా ఉండడంతో అన్నం తినేవాళ్లం కాదు. ఇప్పుడు సన్న బియ్యం సరఫరా చేశారు. ఈ బియ్యంతో తయారుచేసిన భోజ నం చాలా రుచిగా ఉంది.

- దీపిక, 9వ తరగతి

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం రాజధాని అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు లోకేష్ అందించిన తోడ్పాటు పట్ల కృతజ్ఞతలు తెలిపి ప్రస్తుతం నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులపై చర్చించినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని ఈ సందర్భంగా లోకేష్ హామీ ఇచ్చాడని ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



వినికిడి యంత్రాలు అందచేస్తున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

కందుకూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ కోరారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా శుక్రవారం సక్షమ్ సేవా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కల్టెర్ చేతుల మీదగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి మిషన్లు, చేతి కర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల సహితం సమాజంలో తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు ద్వారా తోడ్పాటు అందిస్తున్నాయని తెలిపారు. ముందుగా అమర జీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సబ్ కలెక్టర్ అంకిత భావంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సక్షమ్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర సభ్యుడు చెన్నా రామాంజనేయులు, పట్టణ ఎస్ఐ పీ శివనాగరాజు, చెక్కా కేశవ, మరారిశెట్టి సుధీరు, కోటా కిశోరు, పబ్బిశెట్టి వరదరాజ, కంకణాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

లింగసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పెదపవని ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని చినపవని గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్వాడీలపై సాధికార సర్వేలో నమోదైన ప్రభుత్వ ఉద్యోగి, రూ.12,000 జీతం అనే అంశాలను తొగించాలన్నారు. వారికి కనీస వేతనం రూ26,000 ఇవ్వాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అన్ని రకాల యాప్‌ల ను రద్దు చేసి, ఒకే యాప్ కింద తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ, జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా 9 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అంగన్వాడీ మండల కమిటీ అధ్యక్షురాలిగా ఎస్ రమణ, కార్యదర్శిగా పీ శైలజ, కమిటీ సభ్యులుగా కే సుభాషిణి, ఎం మమత, ఏ విద్యావతి, ఎస్ సుజాత, డీ విజయకుమారి, టీ రేవతిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు కొట్టే వెంకయ్య, ఏ జ్యోతి, జీ శ్యామల, సర్దరీ, శంషాద్ పాల్గొన్నారు.

సింహాద్రిరావుకు ఘన సన్మానం



డాక్టర్ సింహాద్రిరావును సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

బిట్రగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పేద, అనాథ, రోగ పీడుతులకు ఎనలేని సేవలందించిన దళితుడు డాక్టర్ కే.సింహాద్రిరావు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు పొందడం హర్షించ తగ్గ విషయమని పలు దళిత సంఘాల నేతలు ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం బోగోలు మండలం ఎస్సీపాలెం పంచాయతీలోని సింహాద్రి రావు స్వగృహంలో అంబేద్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. సాల్మన్‌రాజు మాట్లాడుతూ సింహాద్రిరావు చేస్తున్న సామా జిక కార్యక్రమాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీ.సతీష్, ఎం.నరేంద్ర, పీ.సుధాకర్, డీ.మాల్యాద్రి, వీ.వెంకట రమణయ్య, వేణుగోపాల్, కే.యస్వంత్, అంబేద్కర్ ఇండియా మిషన్, మాల పరిరక్షణ వేదిక, అంబేద్కర్ ఆర్మీ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో సేదతీరిన పందులు

● మురుగు ముందుకు సాగేదెలా?



మురుగు కాలువలో సేదతీరుతున్న పందులు

కావలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో పందుల సమస్య ఎక్కువగా ఉన్నా వాటిని నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని సబ్‌కోర్టు వీధిలో డ్రైనేజీ కాలువలో పందులు వరసగా సేద తీరాయి. దీంతో మురుగు ముందుకు కదలకుండా రోడెక్కింది. కొన్ని చోట్ల మురుగు నీరు ముందుకు కదలక ఇళ్లలోనే నిలిచి పోతోంది. ప్రస్తుతం రోడ్లపై చెత్త కనిపించకుండా అధికారులు చర్యలు చేపడుతున్నా పందులు నివారించడంలో వెనుకడుగు వేయటంలో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల నివారణకు చర్యలు చేపట్టి మురుగునీటి పారుదలకు ఆటంకాలను తొలగించాల్సి ఉంది.

పైపులైన్‌కు మరమ్మతులు

కావలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని 18వ వార్డులోని బైరాగుల కాలనీలో మంచినీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జి శానం హరి సమాచారం మేరకు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్, ఏఈ వినోద్ శుక్రవారం మరమ్మతులకు గురైన పైపులైన్‌ను పరిశీలించారు. వెంటనే దానికి మరమ్మతుల పనులు చేపట్టి శనివారం ఆ ప్రాంతానికి తాగు నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

కనకదుర్గ అమ్మణ్ణికి సారె సమర్పణ



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గాదేవి

కావలిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వడ్డిపాలెంలో ఉన్న కనకదుర్గా ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ముత్తయిదువ లచే సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పీ మోహన స్వామి మాట్లాడుతూ ఆషాఢ మాసం తొలి శుక్రవారం పురస్కరించు కుని అమ్మవారిని ప్రత్యేక అలంకరణ గావించి ముత్తయిదువులచే సారె సమర్పించారన్నారు. ప్రజలకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించామని సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేశారన్నారు. రెండవ శుక్రవారం అమ్మవారికి శాఖాంబరి అలంకారణ గావించి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పల్లపు మోహన్, గుంజి అహ్మద్, తన్నీరు ప్రభాకర్, పల్లపు కుమార్, పల్లపు వెంకటేశ్వర్లు, శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలి : డీసీ

వలేటివారిపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని డిప్యూటీ కమిషనర్ సాయిబోయిన చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పనిచేసే సిబ్బంది, ఆలయ అధికారులకు శుక్రవారం ఆయన పలు సలహాలు సూచనలు ఇచ్చారు. మరుగుదొడ్లు, కేశఖండనశాల, భక్తులు దర్శనానికి వెళ్లే క్యూలైన్లు, లడ్డూ ప్రసాదం కౌంటర్, తదితర పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసర ప్రాంతాలను ఎప్పటిప్పుడు పరిశుభ్రం చేయాలని తెలిపారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆలయ సిబ్బంది భక్తులతో స్వామి అని గౌరవంగా మాట్లాడాలని పేర్కొన్నారు. భక్తుల పట్ల అగౌరవంగా మాట్లాడినట్లు నా దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంలో ఆలయాన్ని మరింత అబివృద్ధి చేస్తామని తెలిపారు.



మాలకొండలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్

తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

కావలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలక సంఘంలో ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్తను వేరు చేసి దానిని విండ్రోస్ విధానం ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ట్రంకురోడ్డు ఉత్తర శివారులో ఉన్న పాత కంపోస్ట్‌యార్డులో సేంద్రియ ఎరువులు తయారీపై కార్మికులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. తడి చెత్తను ఒక్కో విభాగాన్ని లేయర్లుగా వేస్తూ పేపర్‌వేస్ట్ పరుస్తూ దానిపై పేడ నీరు చల్లుతూ సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నారు. కమిషనర్ మాట్లాడుతూ దీనివలన చెత్తను అంతా మన్నెంగిదిన్నె వద్ద ఉన్న కంపోస్ట్‌యార్డుకు తరలించకుండా అందుబాటులో ఉన్న పాత కంపోస్ట్‌యార్డుకు తడి చెత్తను తరలించి వచ్చన్నారు. ఆ చెత్తతో ఎరువు తయారు చేస్తే రవాణా భారం తగ్గటమే కాక తయారైన సేంద్రీయ ఎరువును పురపాలకసంఘం పెంచుతున్న మొక్కలకు నినియోగించుకుంటూ అవసరమైతే ఇతరులకు విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, ఏఈలు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



పాత కంపోస్ట్‌యార్డులో తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

ఉపాధి హామీ బకాయిలను వెంటనే చెల్లించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కావలిటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ బకాయిల చెల్లింపు, 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.600 కూలీ ప్రధాన డిమాండ్లుగా ఈనెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసిందని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అదేబాటలో పయనిస్తూ కూలీల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారీగా ఉద్యమిస్తున్నామన్నారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సీతారామయ్య, కార్యదర్శి ఎం రాధాకృష్ణయ్య, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు జాన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : సీపీఎం

కావలిటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. శుక్రవారం పట్టణ 18వ వార్డులో ఇంటింటికీ తిరిగి స్మార్ట్ మీటర్లతో నష్టాలపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పెంచలయ్య మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెంచబోమని కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఎన్నికల హామీని విస్మరించి సంవత్సరం కాలంలో 4సార్లు చార్జీలు పెంచిందని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. మరింత అధిక వసూళ్లకై స్మార్ట్ మీటర్ల విధానం తీసుకొచ్చిందని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ ఇప్పుడెలా తీసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదలను పట్టించుకోకుండా అదానీలాంటి బడాబాబుల ప్రయోజనాలు చేకూర్చేవిధంగా పనిచేస్తుందని విమర్శించారు. అధికారం కోసం ఒక మాటా.. అధికారంలోకి వచ్చాక మరొకమాట చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానా లను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రావు, వై కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టుకోండి

అల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలంగా విచ్చలవిడిగా దోచుకుంటున్న దొంగలను వెంటనే పట్టుకొని ప్రజల్లో ధైర్యం నింపాలని జనసేన నాయకులు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డిని కోరారు. అల్లూరు ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏ.శ్రీనివాసులు రెడ్డిని జనసేన నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వరుసగా జరుగుతున్న దొంగతనాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి దొంగలను వెంటనే పట్టుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కార్తీక్ శర్మ, కత్తుల విజయ్, పేట రాఘవయ్య, చేవూరు సుబ్రహ్మణ్యం, వెంకట రమణ, బుర్రి మల్లికార్జున, కత్తి అనీల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణరావు

కొండాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని ఎంపీడీవో ఆదినారాయణరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని శెట్టిపాలెం పంచాయతీలో జరుగుతున్న చెత్త సేకరణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రతిరోజూ గ్రామాల్లో చెత్త సేకరణ జరగాలన్నారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు ఫోన్లు వస్తాయని చెత్త సేకరణ జరిగేది లేనిది ఫోనులో ఖచ్చితంగా తెలియచేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రవీంద్ర తదితరులున్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● ఆటో డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్

బిట్రగుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎన్.ప్రభాకర్ హెచ్చరించారు. బోగోలు మండ ల పరిధిలోని ఆటో డ్రైవర్లతో కప్పరాళ్లతిప్ప పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతలు పాటిస్తూ, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అతివేగం పనికి రాదని, పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు

కలిగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చేసిన సేవలే ఉద్యోగికి సమాజంలో గుర్తింపునిస్తాయని మండల విద్యాశాఖాధికారి సురేష్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేయనున్న కొర్శిపాటి సుగుణమ్మను శుక్రవారం పాఠశాల ఆవరణ లో సహోపాధ్యాయులు, సిబ్బంది, పూర్వవిద్యార్థు లు ఘన సన్మానం చేశారు. విద్యార్థులకు విద్యతోపాటు మంచి నడవడిక నేర్పడంతోపాటు పలు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయిని సుగుణమ్మ ఉపా ధ్యాయులకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీశ్రీ, పలువురు ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సుగుణమ్మ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నిర్లక్ష్యం నీడలో సచివాలయం



- శుభ్రతకు నోచుకోని వైనం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథ కాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని చెప్పే అధికారులు, ఉద్యోగులు వారి కార్యాలయాల్లో మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారనేందుకు ఈ ఫొటో నిదర్శనం. మండలంలోని కాంచెరువు సచివాలయానికి పనులపై వెళ్లిన ప్రజలు అక్కడి పరిస్థితిని చూసి ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ఉద్యోగు లు ఉండే గదుల్లోనూ అపరిశుభ్రత తాండవిస్తోంది. విలువైన సామగ్రిని భద్ర పరచకుండా ఓ గదిలో పడేయడంతో అవి తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. గదులతోపాటు వరండాలోనూ కనీసం చీపురు పట్టి ఊడ్చే దిక్కు లేకపోవడంతో ఎటువైపు చూసిన చెత్తా, చెదారం పేరుకుంటోంది. ఈ కారణం గా దోమల బెడద ఎక్కువైంది. ఉద్యోగులు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, తాగు నీటి సీసాలు, ఇతర వ్యర్థాలను కూడా గదుల్లోనే పడేశారంటే వారి పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లోని సచివాలయల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

- 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ ఓ ప్రక టలో పేర్కొ న్నారు. ర్యాంప్ పథకంలో భాగంగా 30 రోజులు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 58 ఏళ్ల మధ్య వయసు వారు ఆధార్, ఫొటోలు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. నెల్లూరు పరిధిలోని పొగతోటలో గల సమతా నర్సింగ్ హోమ్, కావలిలోని కేవీఆర్ కన్వెన్ష న్ హాల్, కందుకూరులోని సీఆర్‌సీ కమ్యూనిటీ బిల్డింగ్, బుచ్చిలోని అమరావతి కాంప్లెక్స్ సుబ్బయ్య టిఫిన్ సెంటర్ దగ్గర, పొదలకూరు లోని రామాలయంవీధి యోగా కేంద్రం లో దరఖాస్తులు అందజేయా లన్నారు. పూర్తి వివరాలకు 9000173808 , 8121331514 నెంబరులను సంప్రదించాలని కోరారు.

జడ్పీకి సౌర విద్యుత్తు

నెల్లూరు (జడ్పీ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయానికి సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసి, బిల్లుల భారాన్ని తగ్గించనున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంటును శుక్ర వారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు ఆదర్శంగా జడ్పీ కార్యాలయంలో తొలిగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.75లక్షలతో 30కిలో వాట్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లోనూ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో 80శాతం విద్యుత్



సోలార్ ప్లాంటును ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

చార్జీలు తగ్గుతాయని వివరించారు. కేంద్రం రాయితీ ఇస్తున్నందున, దీనిని సద్వినియోగం చేసుకోవాలని, దీనిపై మండల పరిషత్ అధికారులు దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం

కలిగిరమ్మ

- రేపటి నుంచి తిరుణాళ్ల
- 5 రోజుల సంబరం.. 3 ఊళ్లలో గ్రామోత్సవాలు



గ్రామదేవత కలిగిరమ్మ ఆలయం



కలిగిరమ్మ అమ్మవారు

కలిగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలే తీర్చే భక్తుల కొంగు బంగారం కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ. దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన వెంగమాంబ తిరుణాళ్ల అనంతరం మెట్ట ప్రాంతంలో జరుపుకునే కలిగిరమ్మ తిరుణాళ్లను జిల్లాలో జరిగే పెద్ద ఉత్సవాలలో ఒకటిగా చెప్పవచ్చు. 3 గ్రామాల్లో 5 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 29వ తేదీ (ఆదివారం) నుంచి ప్రారంభమై గురువారం వరకు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు వృత్తి రీత్యా దేశ విదేశాలతోపాటు వ్యాపారం రీత్యా సుదూర ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు తరలివస్తారు. వీరితో పాటు బంధుమిత్రలు కూడా అధిక సంఖ్యలో తరలివస్తారు. దీంతో ఈ 5 రోజులు ఈ మూడు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది.

ఆలయ చరిత్ర

సుమారు 300 ఏళ్ల క్రితం కలిగిరి గ్రామంలో వింజమూరు, కొండాపురం రహదారి కూడలిలో వెలసిన కలిగిరమ్మ కలిగిరి పట్టణ ప్రజలతోపాటు చుట్టుప్రక్కల గ్రామప్రజలతో నిత్యపూజలందుకుంటోంది. కలిగిరి గ్రామ దేవతగా ప్రాచుర్యంలోకి వచ్చింది. కలిగిరమ్మకు కలిగిరి పంచాయతీలోని పాపనముసిలిపాలెం పుట్టినిల్లు, జిర్రావారిపాలెం మెట్టినిల్లుగా వాడుకలో ఉంది.

తిరునాళ్ల తంతు

పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారాల ప్రకారం అమ్మవారి తిరుణాళ్లను ఆచార కాపులు అయిన కలిగిరికి చెందిన 'అక్కరాజు' వంశం, పాపన ముసిలిపాలెంకు చెందిన 'పాపన' వంశం, జిర్రవారిపాలెంకు చెందిన 'జిర్రా' వంశం వారి అనుమతులతో ప్రారంభిస్తారు.

ప్రభలు

పొట్టేళ్ళు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లకు అందంగా ప్రభలను అలంకరించుకొని, వాహనాలను దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం ప్రత్యేక ఆకర్షణ. అనంతరం సుడిమాను ఉత్సవానికి భారీగా భక్తులు తరలివస్తారు. నిలుపురోజున అమ్మవారి ఆలయంలో ఉంచిన పాలవెల్లిని చివరగా జిర్రా వంశస్తులు రాజులుగాను, పాపన వంశస్తులు ప్రధానులుగా వ్యవహరించి పనిపాటల వారికి పంచిపెట్టడంతో తిరుణాళ్ల తంతు ముగుస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా సుడిమాను

ఉత్సవాలకు ముందురోజున అమ్మవారి ఆలయం ముందు 'సుడిమాను' ప్రతిష్ఠించడం ఆలయం వద్ద ఆచారంతోపాటు ప్రత్యేక ఆకర్షణ. రెండవరోజు పుట్టినిల్లు పాపనముసిలిపాలెం, మూడవరోజు మెట్టినిల్లు జిర్రావారిపాలెంలో నాల్గవరోజు కలిగిరిలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. తిరుణాళ్ల తంతు చివరి రోజైన ఐదవరోజు దేవాలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతోంది. అమ్మవారికి పొంగళ్ళు, నైవేద్యం సమర్పణతో భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా..

- ప్రభుత్వ బడుల్లో 5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్
- అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం



నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) :విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని 3,221 ప్రభుత్వ పాఠశాలల్లో జులై 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం నిధులను కూడా కేటాయించనున్నారు. పదిమంది పిల్లలు ఉన్న బడులకు వెయ్యి రూపాయలు, 300 నుంచి 400 మంది పిల్లలు ఉన్న బడులకు రూ.5వేలు, ఇలా సంఖ్యను బట్టి నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. వారం రోజులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని డీఈఓ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు జోడించారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరిస్థాయిలో వారు మరికొంత నిధులు సేకరించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా పలు రకాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడి ఈడు పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు, సంపూర్ణ అభివృద్ధిని సాధించడానికి కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.

పిల్లల ప్రగతిపై నివేదికలు

ప్రత్యేకంగా నిర్వహించే ఈ సమావేశంలో పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను తల్లిదండ్రులకు అందచేయనున్నారు. సమగ్రశిక్ష అధికారులు సిద్ధం చేస్తున్న ఈ ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు, హాజరుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో కనబరిచిన ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులు ఇళ్లవద్ద సెల్‌ఫోన్స్, ట్యాబ్‌లు అధికంగా వినియోగంచకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తారు. పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో భాగంగా కుటుంబ ఫొటో బూత్‌లు, డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్‌లు, ఏక్ పేడ్ మా కే నామ్(అమ్మ పేరుతో మొక్క నాటడం), గ్రీన్ పాస్‌పోర్ట్ కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే ఆసక్తి కలిగిన విద్యార్థులు మొక్కలు సరఫరా చేయడానికి ముందస్తుగా పేర్లు నమోదుగా ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులో ఉంచారు. మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహణ



జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను జులై 5న జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆనంద్ పర్యవేక్షణలో డీఈఓ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తాం. జిల్లావ్యాప్తంగా తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం చేస్తాము.

- వెంకట సుబ్బయ్య, సమగ్రశిక్ష ఏపీసీ

ప్రేమ విఫలంతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై మన స్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతంలో నివసించే సాదా వెంకటేశ్వర్లు, వెంకట రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అశోక్(26) ఉన్నారు. అశోక్ ఓ యువతిని ప్రేమించి అది విఫలం కావడంతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంకటేశ్వర్లు హుటాహుటిన కుమారుడిని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటి కే మృతి చెందాడని తెలిపారు. దీంతో ఆయన నవాబుపేట పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): రోడ్డుప్రమా దంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి రామాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రావారిపల్లి గ్రామానికి చెందిన దాడి మాధవరెడ్డి మోటారుబైకుపై ప్రకాశం జిల్లా పామూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదేక్రమంలో కడప జిల్లా ముద్దనూరు నుంచి కూరగాయల లోడుతో రాజమండ్రి వెళ్తున్న ఓ మినీ వ్యానుకు చెందిన ముందు వైపు టైరు బరస్ట్ కావడంతో మోటారుబైకును ఢీకొంది. దీంతో మాధవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రఘునాథ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలి

అనంతసాగరం : ఉప్పలపాడు ఉన్న త పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు ఎంఈవో2 ప్రభాకర్‌రెడ్డికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఎక్కువగా ముస్లీం విద్యార్థులు ఉండగా ఉర్దూ ఉపాధ్యాయుడు లేక ఇబ్బంది పడు తున్నట్లు తెలిపారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

- ఆశించిన స్థాయిలో సాగని ఫ్లైవోవర్ల నిర్మాణ పనులు
- బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద అవస్థలు
- గడువు ముగిసినా సగం కూడా పూర్తి కాని ఆర్వోబీలు



బుజబుజ నెల్లూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం, రోడ్డుపై ఆగిన వాహనాలు

నెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) :రోజు రోజుకు విస్తరిస్తున్న నెల్లూరు నగరంలో జనాభా, వాహనాలు పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువైంది. ప్రధానంగా బుజబుజనెల్లూరు జంక్షన్, గొలగమూడి క్రాస్ రోడ్డు, చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. ఈ జంక్షన్లలో ఫ్లైవోవర్లు (రోడ్ ఓవర్ బ్రిడ్జి-ఆర్వోబీ) నిర్మించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతిపాదనలు తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. వివిధ దశల సమీక్షల అనంతరం 2022లో కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. రూ.85 కోట్ల అంచనాలతో బుజబుజనెల్లూరు వద్ద కిలోమీటర్ మేర ఒక ఫ్లైవోవర్, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద కిలోమీటర్ మేర మరో ఫ్లైవోవర్ నిర్మిస్తున్నారు. వీటితోపాటు సుందరయ్య కాలనీ నుంచి గొలగమూడి క్రాస్ రోడ్డు వరకు సర్వీసు రోడ్డును కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ అనుమతులు రాగానే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వేగంగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. 2022, అక్టోబరులో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు.

ఆలస్యంగా నిర్మాణాలు

టెండర్ నిబంధనల ప్రకారం రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ తొలుత భూసేకరణ సమస్యతో కొన్ని నెలలపాటు పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు భూసేకరణను పూర్తి చేశారు. అనంతరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరో సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ క్రమంలోనూ కొంత కాలం పనులు ఆలస్యమయ్యాయి. పనులు ఆలస్యంగా జరగడంపై అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో గతేడాది పనులు మొదలుపెట్టించారు. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్ల వద్ద ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేశారు. అయితే పనులు మొదలైనప్పటి నుంచీ ఆశించినంత వేగంగా జరగడం లేదు. గతేడాది చివరికే పనులు పూర్తి కావాల్సి ఉన్నా అలా జరగకపోవడంతో కాంట్రాక్టర్‌కు ఈవోటీ (గడువు పొడిగింపు) ఇచ్చారు. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబరు నాటికి బ్రిడ్జీలు పూర్తి కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు మాదిరిగా కొనసాగిస్తే వచ్చే ఏడాది అక్టోబరు నాటికి కూడా పనులు పూర్తి చేయడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

డిసెంబరు నాటికి పూర్తి

నెల్లూరు నగర పరిధిలోని రెండు ఫ్లైవోవర్ నిర్మాణ పనులు వేగంగానే జరుగుతున్నాయి. మొదట్లో భూసేకరణ సమస్య, యాష్ సమస్యతో కొంత ఆలస్యమయ్యాయి. ఈ ఏడాది చివర వరకు కాంట్రాక్టర్‌కు ఈవోటీ ఇచ్చారు. డిసెంబరు నాటికి బ్రిడ్జీలు పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నాం.

- కొండయ్య చౌదరి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ

మైన్ల పరిశీలన

సైదాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మైనింగ్‌లు జరుగుతున్నాయని గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారుల బృందం సంయుక్తంగా శుక్రవారం పరిశీలించింది. ఈసందర్భంగా జయలక్ష్మీ, కనకదుర్గ, శ్రీనివాస పద్మావతి, కేఎస్‌ఆర్ వరసిద్ధి వినాయక మైన్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో నాగసంతోషి అనూష, తహసీల్దారు సుభద్ర, మైనింగ్, పొల్యూషన్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమశిలలో 33.300 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 196 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 33.300 టీఎంసీల నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు వదులుతున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

నెల్లూరు(విద్య), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈవోకు కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్నీ పాఠశాలల కరస్పాండెంట్లకు ఉత్తర్వులివ్వాలని సూచించారు. దీనిపై డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు స్పందిస్తూ జిల్లాలోని అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లతో మాట్లాడి 50శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని, దీనిని తక్షణమే అమలు చేయాలని ఆదేశాలిచ్చారు.

మొహర్రం నెల ప్రారంభం

- ముస్లింల పవిత్ర ప్రార్థనలు
- రొట్టెల పండుగకు జెండా ప్రతిష్ఠ



బారా షహీద్ దర్గాలో భక్తుల సందడి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇస్లాం క్యాలెండరులో మొదటి నెలైన మొహర్రం శుక్రవారం ప్రారంభమైంది. ముస్లింలు రంజాన్ మాసం తర్వాత పవిత్ర మాసంగా దీనిని పాటిస్తారు. దైవ ప్రవక్త మహ్మద్ మనుమళ్లు హుస్సన్- హుసేన్ వీరోచిత ప్రాణ త్యాగానికి గుర్తుగా పీర్లు ఏర్పాటు చేసి పూజిస్తారు. 10వరోజు మొహర్రం నిప్పుల గుండం తొక్కుతారు. పీర్లను వీధుల్లో ఊరేగించి జలధిలో కలుపుతారు. ఈ మాసంలో నెల్లూరులో మత సామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ జరుగుతుంది. దేశవిదేశాల నుంచి భక్తులు నెల్లూరు నగరంలోని బారాషహీద్ గంధ మహోత్సవానికి తరలివస్తారు. అలాగే కసుమూరులోని దర్గాను, ఏఎస్‌పేట దర్గాను దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు.

దర్గాలో భక్తుల సందడి

మొహర్రం నెల, రొట్టెల పండుగ పనులకుగాను గురువారం రాత్రి బారాషహీద్ దర్గాలో జెండా ప్రతిష్ఠించి, ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేశారు. దీంతో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకపోకలతో దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌లో సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామం లో పీర్ల చావిళ్ల ఏర్పాటు సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూలై 6 నుంచి 10వతేదీ వరకు రొట్టెల పండుగ జరగనుంది.

కసుమూరు దర్గా హుండీల ఆదాయం రూ.44,01,700

వెంకటాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలి దర్గా ప్రధాన హుండీల ద్వారా రూ.44,01,700 ఆదాయం వచ్చినట్లు దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్ తెలిపారు. ఆ నగదుకు గ్రామస్థులు, దర్గా ముజావర్ల సమక్షంలో వక్ఫ్‌బోర్డు అధికారులు శుక్రవారం రాత్రి పంచనామా చేశారు. దర్గాలో ఉన్న 8 హుండీలకు గాను రెండు ప్రధాన హుండీలను మాత్రమే లెక్కించినట్లు చెప్పారు. మిగిలిన 6 హుండీలను 15 రోజుల తర్వాత లెక్కిస్తారన్నారు. హుండీల లెక్కింపు వక్ఫ్‌బోర్డు అధికారులు హుస్సేన్, ఖుదావన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసుల సమక్షంలో గ్రామస్థులు, దర్గా ముజావర్ల పర్యవేక్షణలో జరిగిందన్నారు.



పంచనామా చేసేందుకు నగదు సిద్ధం చేస్తున్న వక్ఫ్ బోర్డు అధికారులు